RNI No. APTEL/2018/75566

# రేపటి కోసం

REPATIKOSAM

తెలుగు దినపత్రిక

Postal Regn. No.GTR/111/2025-27

సంపుటి:9, సంచిక: 08 | మంగళవారం 28-4-2026 | Publishing From Guntur | పేజీలు : 8+2 | వెల. రూ.6.00

## వాసిరెడ్డి వేంకటాద్రి నాయుడుకు సీఎం నివాళి



వాసిరెడ్డి వేంకటాద్రి నాయుడు జయంతి సందర్భంగా క్యాంప్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు . -అమరావతి, రేపటికోసం



**గార్గేయం**

బ్రాహ్మీ ఉ04.14-04.59, సూ.ఉ05.44-సూ.అ:06.26, చంద్రోదయం : మ03.43, చంద్రాస్తమ : రా03.56, శు.ద్వాదశి సా06.51, ఉత్తర రా10.36, శేషవర్జ్యం ఉ06.35 వరకు, దుర్ము ఉ08.17-09.07, రా10.57-11.42, అమృత మ03.01-04.42, రా.కా.మ03.15-04.51, వ్యాఘాతయోగం రా09.04, బవకరణం ఉ06.30 , అభిజిత్ మ11.40-12.30, నక్షత్రపాద ప్రారంభాలు: ఉత్తర 3: ఉ 09.54,ఉత్తర 4: సా04.14 హస్త 1: రా10.37, హస్త 2: రా తె04.59, పితృతిథి : శు.ద్వాదశి, పరశురామ ద్వాదశి

శ్రీనివాస గార్గేయ : 9348632385

## టెక్నాలజీతో నాణ్యమైన వైద్యసేవలు

- వందల కిలో మీటర్ల దూరం నుంచి అందుబాటులోకి స్పెషలిస్టుల సేవలు
- దేశంలోనే తొలి టెలి-రోబోటిక్ సర్జరీ చేసిన నారాయణ-జీఎస్ఎల్ ఆస్పత్రులకు సీఎం అభినందన



**అమరావతి, రేపటికోసం:** టెక్నాలజీని సమర్థంగా వినియోగిస్తే వైద్య సేవలను ప్రజలకు మరింత సులభతరం చేయవచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. సోమవారం క్యాంప్ కార్యాలయంలో సీఎం చంద్రబాబును నారాయణ మెడికల్ కాలేజీ-ఆస్పత్రులు, జీఎస్ఎల్ మెడికల్ కాలేజీ-ఆస్పత్రుల యజమాన్యాలకు చెందిన ప్రతినిధులు కలిశారు. ఇటీవల తమ రెండు ఆస్పత్రులు కలిసి - మిగతా 7లో

# 100 ఏళ్ల చరిత్ర ఒక బ్రాండ్



- గూగుల్ కంటే ముందే ఏయూ ప్రపంచాన్ని కనెక్ట్ చేసింది

- 57 దేశాలతో ఏయూ సంబంధాలు
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

**విశాఖపట్నం, రేపటి కోసం:** ఆంధ్ర విశ్వవిద్యాలయం ఒక అపూర్వ విద్యాసంస్థ అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కొనియాడారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం 100 సంవత్సరాల ఉత్సవంలో సోమవారం ఆయన మాట్లాడుతూ, "నేను ఎన్నో కార్యక్రమాలకు వెళ్లాను కానీ... యూనివర్సిటీలో మీ ఉత్సాహం చూస్తుంటే మీ ఆనందం ఆకాశాన్ని తాకుతోంది. విద్యార్థులు, పూర్వ విద్యార్థులకు అభినందనలు తెలుపుతున్నాను. రెండు ప్రతిష్టాత్మక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు నేను విశాఖ వచ్చాను. 100 ఏళ్ల ఏయూ పండుగ ఒక చరిత్ర. రేపు ప్రపంచంలో నెంబర్ 1 టెక్నాలజీ దిగ్గజం గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు మరో చరిత్ర. ఆర్థిక సంస్కరణలు వచ్చాక 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెడుతున్నారంటే అది విశాఖ గొప్పతనం. గూగుల్ కంటే ముందుగానే ఏయూ ప్రపంచాన్ని విశాఖతో కనెక్ట్ చేసింది. 57 దేశాల విద్యార్థులు ఇక్కడ - మిగతా 7లో




## సింగపూర్‌లో ఏడవ రోజు మంత్రుల శిక్షణ




**సింగపూర్/అమరావతి, రేపటికోసం:** డిజిటల్ టు ది కోర్, అండ్ సర్వ్ విత్ హార్ట్" అనే నినాదంతో నడుస్తున్న సింగపూర్ డిజిటల్ గవర్నమెంట్ స్ట్రాటజీ, సింగపూర్ పౌరులు,నివాసితులకు అందించే అత్యంత సురక్షితమైన డిజిటల్ గుర్తింపు కార్డు - సింగ్‌పాస్, పౌరుల సమగ్ర మెడికల్ రికార్డ్స్ వైద్య చరిత్రను ఎప్పుడైనా చూసుకునేలా ప్రత్యేకంగా రూపొందించిన ఆరోగ్య సేవల యాప్ - హెల్త్‌హబ్‌వంటి కీలకమైన డిజిటల్ సేవలు గురించి సింగపూర్‌లో సుదీర్ఘకాలం పనిచేసిన అనుభవజ్ఞుడు టాన్ ఎంగ్ ఫెంగ్ మంత్రులకు వివరించారు.

### పెట్రోల్, డీజిల్ సరఫరాలో

## రవాణా సంస్థలు అప్రమత్తంగా ఉండాలి

- ప్రజలకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచనలు
- మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



**అమరావతి, రేపటికోసం:** రాష్ట్రంలో ఎక్కడా ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా అన్ని రవాణా సంస్థలు తక్షణ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుండి పత్రికా ప్రకటన విడుదల చేశారు. పెట్రోల్, డీజిల్ సరఫరాలో తాత్కాలిక అంతరాయాలు ఉన్నప్పటికీ, ప్రయాణికుల సేవల్లో ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని బస్సులు ఇతర రవాణా సేవలు నిరంతరంగా కొనసాగించాలని, రవాణా సంస్థలు, ప్రైవేట్ ఆపరేటర్లు - మిగతా 7లో

## ఏయూ భారతదేశానికే గర్వకారణం

- ఆంధ్ర యూనివర్సిటీ ఒక ఇన్ స్టిట్యూషన్ మాత్రమే కాదు.. ఒక ఎమోషన్
- దేశంలోనే అత్యంత ప్రాచీన యూనివర్సిటీల్లో ఏయూ ఒకటి
- ఆంధ్ర యూనివర్సిటీ అభివృద్ధికి ఎంతోమంది కృషిచేశారు
- దేశంలోనే ఓవరాల్ ర్యాంకింగ్స్‌లో ఏయూ 3వ స్థానం సాధించడమే లక్ష్యం
- రీసెర్చ్ కోసం ఏయూకు రూ.250 కోట్లు కేటాయించాలి
- విశాఖలో ఆంధ్రా యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాల్లో మంత్రి నారా లోకేష్

**విశాఖపట్నం, రేపటి కోసం:** ఆంధ్ర యూనివర్సిటీ ఒక ఇన్ స్టిట్యూషన్ మాత్రమే కాదని, తనలాంటి వారికి ఒక ఎమోషన్ అని, ఏయూ ఏపీకి మాత్రమే కాదు.. భారత దేశానికే గర్వకారణమని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. సోమ వారం విశాఖ ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహించిన ఆంధ్ర విశ్వవిద్యా లయం శతాబ్ది ఉత్సవాల్లో సీఎం చంద్రబాబు నాయుడుతో కలిసి - మిగతా 7లో




## కృషి, పట్టుదల ఉంటే అన్నీ సాధ్యమే

### ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్..



**విశాఖపట్నం, రేపటి కోసం:** కృషి, పట్టుదల ఉంటే ప్రతిదీ సాధ్యమేనని ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ అన్నారు. మనసు ఉంటే మార్గం ఉంటుందని.. విజయాల కంటే వైఫల్యాలే ఎక్కువ నేర్పుతాయని అభిప్రాయపడ్డారు. విశాఖలోని ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాల్లో ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏయూ ఇంజనీరింగ్ కళాశాల గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించారు.విద్యారంగంలో ఏయూ ముందుందని రాధాకృష్ణన్ తెలిపారు. దేశంలోనే కాకుండా ప్రపంచంలోనే ప్రముఖ విద్య సంస్థగా ఏయూ ఎదగాలని - మిగతా 7లో

## కామెడీ వినోదం పంచాలి.. విద్వేషం కాదు..

- బెంగళూరులో స్టాండప్ కమెడియన్ షోలో జరిగిన పరిణామాన్ని ఖండిస్తున్నాం
- చౌకబారు ప్రచారం కోసం కొందరు స్టాండప్ కమెడీయన్లు చేస్తున్న పని
- కార్యకర్తలు పార్టీ సిద్ధాంతాలకు విరుద్ధంగా ప్రవర్తించవద్దు
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ రావు



**అమరావతి, రేపటికోసం:** బెంగళూరులో స్టాండప్ కమెడియన్ శరత్ ఉదయ్ షో సందర్భంగా చోటుచేసుకున్న సంఘటనను తెలుగుదేశం పార్టీ తీవ్రంగా పరిగణిస్తోంది. ఏదైనా అంశంపై అభ్యంతరాలు ఉంటే, ప్రజాస్వామ్యబద్ధంగా చట్టపరమైన మార్గాల్లో పోరాడాలి. నిబంధనల ప్రకారం ఫిర్యాదులు చేయాలి తప్ప, ఎవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదు. ఆవేశంతో వ్యవహరించడం వల్ల అసలు సమస్య పక్కదారి పట్టి, - మిగతా 7లో

## యువనేత కృషితోనే విశాఖకు గూగుల్ ఏఐ హబ్

- ప్రపంచానికి డేటా షేరింగ్‌లో విశాఖ కేంద్రంగా నిలవనుంది
- విశాఖకు వైసీపీ గంజాయి తెస్తే.. కూటమి గూగుల్ తెచ్చింది
- గూగుల్‌ను అడ్డుకునేందుకు వైసీపీ విశ్వప్రయత్నాలు విఫలం
- చేసేదేమి లేక గూగుల్ తెచ్చింది మేమే అంటూ క్రెడిట్ చోరీకి యత్నం
- ఏపీ శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ ధ్వజం



**అమరావతి, రేపటికోసం:** విశాఖను గ్లోబల్ స్థాయి టెక్ నగరం తీర్చిదిద్దుతుంటే వైసీపీ మాత్రం ప్రభుత్వంపై విషం చిమ్మడం చంద్రబాబు అభివృద్ధి క్రెడిట్‌ను చోరీ చేసే పనిలో నిమగ్నమైందని ఏపీ శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ మండిపడ్డారు. సోమవారం తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పాల్గొన్న ఆమె మొదట్లో గూగుల్ వద్దని కోర్టులు పిటిషన్‌లు వేసి, వ్యతిరేకించిన వారే నేడు క్రెడిట్‌ను కొట్టేసే పనిలో ఉన్నారని, క్రెడిట్ చోరీ వైసీపీ సిద్ధాంతమని - మిగతా 7లో

## రెన్యూవబుల్ ఎనర్జీ ఉత్పాదన పెంచడమే లక్ష్యం

- విద్యుత్ కొనుగోలు ఛార్జీలను యూనిట్‌కు రూ.4.60కు తగ్గించేలా ప్రణాళికలు
- ఇంధన రంగంలో పరిశోధనకు ప్రత్యేక ఎనర్జీ యూనివర్శిటీ
- ఈవీ వాహనాలపై ప్రజల్లో విస్తృత అవగాహన
- పీఎం సూర్య ఘర్, కుసుమ్ పథకాల అమలులో లక్ష్యాలను చేరుకునేలా కార్యాచరణ
- విద్యుత్ శాఖపై సీఎం సమీక్ష



**అమరావతి, రేపటికోసం:** ప్రజా ప్రయోజనాల కోసమే సంస్కరణలు తెస్తున్నామని ఆ సంస్కరణల అమలు కోసం టెక్నాలజీని పూర్తి స్థాయిలో వినియోగించు కోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. తక్కువ వ్యయంతో విద్యుత్ ఉత్పత్తి చేసే అంశంపై నిరంతరం అధ్యయనం, జరుగుతూనే ఉండాలని - మిగతా 7లో

## శేషాచలం అడవుల్లో అగ్నిప్రమాదంపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆరా

### బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశం



**అమరావతి, రేపటికోసం:** తిరుపతి పరిధిలోని శేషాచలం అడవుల్లో ఆదివారం సాయంత్రం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. అడవులను సంరక్షించే కపిలతీర్థంలోని అటవీశాఖ జిల్లా ప్రధాన కార్యాలయానికి అత్యంత సమీపంలోనే మంటలు వ్యాపించాయి. అటవీశాఖ అధికారులు, సిబ్బంది నిత్యం పహారా కాసే ప్రదేశానికి దగ్గరలోని అటవీ ప్రాంతానికే ఆకతాయిలు నిప్పు - మిగతా 7లో

## ఆయిల్ కంపెనీలు నిరంతరం పనిచేయాలి

### రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కొరతపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు టెలీకాన్ఫరెన్స్



**అమరావతి, రేపటికోసం:** పౌర సరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, సివిల్ సప్లై ఉన్నతాధికారులు, పెట్రోలియం కంపెనీల ప్రతినిధులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. సమస్య పరిష్కారానికి నిన్న రాత్రి నుంచి ఇప్పటి వరకూ తీసుకున్న చర్యలపై సీఎం చంద్రబాబు వివరణ కోరారు. ఈ రోజు సాయంత్రానికి మెజారిటీ ప్రాంతాల్లో సాధారణ స్థితి ఏర్పడుతుందని ముఖ్యమంత్రికి వివరించిన అధికారులు, ఆయిల్ కంపెనీల ప్రతినిధులు.పెట్రోల్, డీజిల్ సరఫరాలో సాధారణ పరిస్థితిని తెచ్చేందుకు అధికారులు, ఆయిల్ కంపెనీల యాజమాన్యాలు సమన్వయంతో పని చేయాలని సీఎం - మిగతా 7లో

## భారత్ ఏఐలో విశాఖ గూగుల్ క్లౌడ్ ఇండియా స్వర్ణయుగం

### - మంత్రి కొండపల్లి శ్రీనివాస్

**అమరావతి, రేపటికోసం :** విశాఖపట్నంలో ఏర్పాటు చేసే గూగుల్ ఏఐ డేటా సెంటర్ భారతదేశ డిజిటల్ రంగంలో ఒక చారిత్రాత్మక మైలురాయిగా నిలవబోతోందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం గూగుల్ క్లౌడ్ ఇండియా ఏఐ హబ్ పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , గూగుల్ క్లౌడ్ సీఈఓ థామస్ కురియన్ శంకుస్థాపన చేస్తోన్న నేపథ్యంలో మంత్రి కొండపల్లి దీనిని ఏపీ చరిత్రలో అతి గొప్ప ప్రాజెక్టుగా అభివర్ణించారు. ఈ ప్రాజెక్టు పూర్తయ్యాక దేశం మొత్తం ఏపీ వైపు చూడడం ఖాయం అన్నారు. రు. 87,520 కోట్ల పెట్టుబడితో గూగుల్ ద్వారా 1,000 మెగావాట్ల ఏఐ డేటా సెంటర్ హబ్ ఏర్పాటు - మిగతా 7లో

### ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు అనుబంధ ప్రైవేటు ఆసుపత్రులకు

## బకాయిల చెల్లింపులు ప్రారంభం

### ఒప్పందాలకు అనుగుణంగా 25 అస్పత్రులకు రూ. 62 కోట్లు చెల్లింపు




**అమరావతి, రేపటికోసం:** ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు అనుబంధ ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలకు రూ.1,000 కోట్ల బకాయిలను 'ట్రై-పార్టీ బిల్ డిస్కౌంటింగ్. అగ్రిమెంట్' (టీబీడీఏ) విధానంలో చెల్లింపుల ప్రక్రియను కూటమి ప్రభుత్వం ప్రారంభించింది. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రత్యేకంగా - మిగతా 7లో

## భారతీయ సిబ్బంది ఉన్న నౌకపై ఇరాన్ దాడి



**ఒమన్:** ఒమన్ తీర సమీపంలో భారతీయ సిబ్బందితో వెళ్తున్న నౌకపై ఇరాన్ కోస్ట్‌గార్డ్ దళాలు కాల్పులు జరిపాయి. ఈ విషయాన్ని కేంద్ర ఓడరేవులు, నౌకా రవాణా, జలమార్గాల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. టోగో దేశ జెండాతో వెళ్తున్న ఎంటీ సిరాన్ అనే చమురు నౌకపై శనివారం ఈ దాడి జరిగినట్లు తెలిపింది. ఇతర నౌకలతో పాటు ఎంటీ సిరాన్ కలిసి ప్రయాణిస్తుండగా ఇరాన్ తీర రక్షకదళం దానిని అడ్డగించి, హెచ్చరికగా పలు రౌండ్ల కాల్పులు జరిపినట్లు పేర్కొంది. అక్కడి పరిస్థితులను పర్యవేక్షించడానికి విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (వీజూూ), భారత రాయబార కార్యాలయాలు అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపింది. నౌకలోని సిబ్బంది సురక్షితంగా ఉన్నట్లు వెల్లడించింది. అయితే ఎంతమంది ఉన్నారనే విషయంపై స్పష్టత లేదు.

## సంపాదకీయం

# ఆశల పల్లకిలో బెంగాల్ నేతలు

పశ్చిమ బెంగాల్ లో ఇదివరకెన్నడూ కనీవినీ ఎరుగని రీతిలో మొదటి దశ ఏ పోలింగ్లో అత్యధికంగా 92 శాతం ఓటింగ్ జరగడం ఎవరికి వారే గెలుపు మాకే అన్న ఆశల పల్లకీలో ఊగుతున్నారు. ఈ మొదటి దశ నియోజక వర్గాల పరిధిలో ఓటర్ల జాబితా సవరణ తర్వాత 9.9 శాతం నుండి 11.6 శాతం వరకు ఓటర్ల పేర్లు తొలగించడంతో ఓటర్ల సంఖ్య తగ్గిపోయినప్పటికీ పోలింగ్ శాతం మాత్రం ఎక్కువగానే నమోదు కావడం విశేషం. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో ఈ నియోజకవర్గాల పరిధిలో తృణమూల్ కాంగ్రెస్ 92, బిజెపి 59 స్థానాలు సాధించుకున్నాయి. అప్పటి ఎన్నికలకు ఇప్పటి ఎన్నికలకు చాలా తేడా కనిపిస్తోంది. మొత్తం 294 సీట్లకు తానే తృణమూల్ అభ్యర్థినని, తమ అభ్యర్థులపై అసంతృప్తి ఉన్నా తనపై నమ్మకం ఉంచాలని ఉదృతంగా ఆమె ప్రచారం సాగించారు. ఆమె పాప్యులారిటీ ఎన్నికల ప్రచారంలో కేంద్ర బిందువు అయింది. అయితే ఎంతవరకు ఈ పాప్యులారిటీ ఓట్లను కురిపి స్తుందో చెప్పలేం. రాష్ట్రంలో ఎన్నో సమస్యలు ఉన్నాయి. తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఎన్నో లోపాలు ఉన్నాయి. ఇవన్నీ విస్మరించి ఆమె మద్దతు దారులు అలాగే కొనసాగుతారా అన్నది ప్రశ్న. టిఎంసి గత పదిహేనేళ్ల పాల నలో పారిశ్రామిక వృద్ధి లేదు సరికదా క్షీణత కనిపిస్తోంది. రుణభారం ఎక్కు వైంది. నిరుద్యోగం తాండవిస్తోంది. పాలనలో అవినీతి ఆరోపణలు ఎక్కువగా వస్తున్నాయి. పార్టీ అంతర్గత సమస్యలు, హింసాత్మక సంఘటనలు తీవ్రంగా సాగుతున్నాయి. ఇంతటి గందరగోళంలో కూడా ప్రజలు మమతా బెనర్జీ వ్యక్తిగత నాయకత్వాన్ని లేదా ప్రతిష్టను పొగుడుతున్నారు. తృణమూల్ కాంగ్రెస్ పార్టీని, ప్రభుత్వ పాలనను తిడుతున్నారు. మమత వేరు, పార్టీ వేరు, ప్రభుత్వం వేరు అని విడివిడిగా ప్రజలు చూస్తున్నారు. ఈ రెండురకాల విభిన్న అభిప్రా యాలు సమాంతరంగా సాగుతున్నాయి. అందుకని ప్రజల తీర్పు ఎలా ఉంటుందో చెప్పలేం. ఎన్ని లోపాలున్నా ఆమె సంక్షేమ పథకాల నమూనా ఆ లోపాలను కప్పిపుచ్చుతోంది. బెంగాల్ వీర వనితగా, రక్షకురాలిగా, పోషకురా లిగా ప్రజలు భావిస్తూ దీదీ అని సంబోధిస్తున్నారు. ఆమె ఏదిచేసినా బెంగాల్ ప్రయోజనాల కోసమే అన్న నమ్మకం చెక్కుచెదరలేదు. ఓటర్ల జాబితా సవర ణలో జరిగిన తప్పులపై ఆమె మడం తిప్పకుండా పోరాటం సాగించారు. చివ రకు సుప్రీం కోర్టు ముందు ఆమె స్వయంగా వాదించడం విశేషం. కరోనా మహమ్మారి తీవ్రంగా విజృంభిస్తున్న సమయంలో 2021 నాటి అసెంబ్లీ ఎన్ని కల్లో 82.30 శాతం పోలింగ్ జరిగింది. మొత్తం 294 అసెంబ్లీ స్థానాలకు 213 స్థానాలను తృణమూల్ కాంగ్రెస్ సాధించుకుని అధికార పీఠాన్ని రెండోసారి కైవసం చేసుకుంది. గురువారం 3.6 కోట్ల మంది ఓటర్లు ఓటు వేసినట్టు రికా ర్డయి 92.25 శాతం పోలింగ్ నమోదైంది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత పశ్చిమబెంగాల్ తోపాటు తమిళనాడులో కూడా అత్యంత ఎక్కువ శాతం పోలింగ్ ఇదేనని చీఫ్ ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెల్లడించారు. ఈసారి ఎన్ని కల్లో ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణ ప్రక్రియ నిర్వహించడంలో ఎన్నో వివా దాలు, అనుమానాలు తలెత్తినప్పటికీ మొట్టమొదట 63 లక్షల ఓటర్ల పేర్లను తొలగించి, తరువాత న్యాయ పరిశీలనలో 27 లక్షల ఓటర్లు ఆనర్హులని ప్రక టించినా, పోలింగ్ ఎక్కడా పలచబడలేదు. మొదటి దశ ఎన్నికలకు ముందు గత వారం ఏడు లక్షల కొత్త ఓటర్లను చేర్చుకోవడమైందని ఎన్నికల కమిషన్ ప్రకటించింది. పోల్ అధికారుల వివరాలు ప్రకారం మొదటి దశలో 3.22 లక్షల కొత్త ఓటర్లు ఓటు వేసి ఉంటారని భావిస్తున్నారు. మిగతా దాదాపు 3.88 లక్షల ఓటర్లు రెండో దశ పోలింగ్లో ఓటు వేయగలరని అంచనాగా చెబుతున్నారు. ముర్షీదాబాద్ కలుపుకుని, ఉత్తర 24 పరగణాలు, మాల్డా, నాడియా, దక్షిణ 24 పరగణాలలో అనేక జిల్లాల్లో రికార్డు స్థాయిలో ఓటరు జాబితాలోంచి పేర్లు తొలగించబడ్డాయి. . కోల్కతాలో అనేక నియోజకవర్గాలకు చెందిన దాదాపు 7 లక్షల ఓటర్లు జాబితా లోంచి తొలగించబడ్డారు. నగరంలోని ఉత్తర, దక్షిణ సెగ్మెంట్లలో ఓటరు సంఖ్య బాగా తగ్గింది. బీహార్లోసర్ ప్రక్రియ తరువాత అంతకు ముందు ఎన్నికల కన్నా ఓటర్ పోలింగ్ శాతం 2025 అసెంబ్లీ ఎన్నికల్లో బాగా పెరిగింది. బీహార్లో 2015 లో 56.91 శాతం, 2020లో 57.29 శాతం పోలింగ్ జరగ్గా, 2025లో 67.13 శాతం పోలింగ్ నమోదైంది. ఎన్నికల కమిషన్ ఓటర్ల జాబితాను సవరించిన తరువాత కొన్ని లక్షల పేర్లను తొలగించారు. ఈ ప్రక్రియపై ఎన్నో విమర్శలు వచ్చినప్ప టికీ, ఖరారైన సంఖ్యతో బీహార్ లో గత కొన్ని దశాబ్దాలలో లేని విధంగా అత్య ధికంగా ఓటింగ్ జరగడం, స్వచ్ఛమైన ఓటర్ల జాబితాతోపాటు బలమైన ఎన్ని కల నిర్ణయంగా అభివర్ణిస్తున్నారు. బెంగాల్లో మొత్తం 294 అసెంబ్లీ నియోజ కవర్గాల్లో 152 నియోజకవర్గాలకే తొలిదశలో పోలింగ్ జరిగింది. సౌత్ దినాజ్ పూర్లో 94.37 శాతం అత్యధికంగా పోలింగ్ జరిగింది. కూచోబీహార్లో 93.73 శాతం పోలింగ్ జరిగింది. దేశం లోనే అత్యధికంగా పశ్చిమబెంగాల్లో పోలింగ్ శాతం జరగడానికి బలమైన పార్టీ క్యాడర్లు, జనాభా, సమాజ గమన శీలత, అధికంగా మహిళలు ఓటింగ్లో పాల్గొనడం ప్రధాన కారణాలుగా విశ్లే షిస్తున్నారు. టిఎంసి, బిజెపి ఈ ట్రెండ్ తమకే అనుకూలంగా ఉందని ఎవరికి వారే వారే గొప్పగా ఊహించుకోవడం విశేష విశేషం. మొదటి దఫా ఎన్నికల్లో ప్రజలు బిజెపికి గట్టి దెబ్బతీశారని, తమ పూర్తి మద్దతు టిఎంసికి, మమత ప్రభుత్వానికే ఇచ్చారని, 152 స్థానాలకు గాను టిఎంసి కనీసం 125 స్థానాలైనా దక్కించు కుంటుందని 90 శాతం పోలింగ్ జరగడాన్ని ఉదహరిస్తూ టిఎంసి నాయకుడు కునాల్ ఘోష్ ధీమా వ్యక్తం చేశారు.

## సరైన సమయంలో
# సరైన నాయకత్వం చంద్రబాబు

2024లో చంద్రబాబు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టినప్పుడు రాష్ట్రం మామూలు స్థితిలో లేదు. రూ. పది లక్షల కోట్లకు పైగా అప్పులు, ఆగిపోయిన రాజధాని, పారిపోయిన పెట్టుబడులు, ఖాళీగా పడి ఉన్న పరిశ్రమల స్థలాలు. ఇవి వారసత్వంగా వచ్చిన సమస్యలు. ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు ఇవ్వడానికే కష్టపడే స్థితిలో రాష్ట్ర ఖజానా ఉంది. సంక్షేమ పథకాలు నడపాలి, అప్పులపై వడ్డీ కట్టాలి, అభివృద్ధి పనులు చేయాలి. కానీ డబ్బు లేదు. ఇంత కష్టమైన స్థితిలో ఒక రాష్ట్రం బయటపడే దారి ఒక్కటే. సంపద సృష్టించడం. సంక్షేమం తగ్గించలేరు, జీతాలు ఆపలేరు, వడ్డీలు వదలరు. మిగిలిన దారి ఒక్కటే. పరిశ్రమలు రావాలి, పెట్టుబడులు రావాలి, పన్ను ఆదాయం పెరగాలి. ఇది సిద్ధాంతం కాదు, మనుగడకు అవసరమైన గణితం.



ఈ గణితాన్ని అర్థం చేసుకోవడానికి ఒక్క పరిశ్రమ వస్తే ఏం జరుగుతుందో ఆలోచించండి. ఆ పరిశ్రమ వేల మందికి ఉద్యోగాలు ఇస్తుంది. ఆ ఉద్యోగులు జీతాలు తీసుకుంటారు, స్థానికంగా ఇళ్ళు కట్టుకుంటారు, హోటళ్ళలో తింటారు, దుకాణాల్లో కొంటారు. అంటే చుట్టుపక్కల మరో వేయి మందికి పరోక్ష ఆదాయం వస్తుంది. ఆ పరిశ్రమ కట్టిన భవనాలపై ఆస్తి పన్ను వస్తుంది, అమ్మిన వస్తువులపై వస్తు సేవల పన్ను వస్తుంది, ఉద్యోగుల జీతాలపై ఆదాయపు పన్ను వస్తుంది. ఈ పన్నులన్నీ రాష్ట్ర ఖజానాలోకి వెళ్తాయి. ఆ డబ్బుతో మరిన్ని రోడ్లు వేయవచ్చు, మరిన్ని బడులు కట్టవచ్చు, మరిన్ని ఆసుపత్రులు తెరవచ్చు. అంటే ఒక పెట్టుబడి వస్తే అది ఒకచోట ఆగదు . అది అలలు అలలుగా సమాజమంతా పాకుతుంది. ఇదే పెట్టుబడి యొక్క అసలు శక్తి.

అక్కడే చంద్రబాబు నాయుడు గారి నేపథ్యం ప్రాసంగికమవుతుంది. 1990లలో హైదరాబాద్ ఒక సాధారణ నగరం. ఆయన అధికారంలో ఉన్న దశలో అది దేశంలో సమాచార సాంకేతిక రాజధానిగా మారింది. అది కాకతాళీయం కాదు . దూరదృష్టితో వేసిన వ్యూహం. ఆ ఒక్క నిర్ణయం వల్ల తెలుగువారి జీవితాలు ఎంతగా మారాయో నేటికీ కనిపిస్తూనే ఉంది. అదే దృష్టిని ఇప్పుడు మరింత పదునుగా పెట్టుబడిదారుల ముందు పెడుతున్నారు. ఏప్రిల్ 14, 2026న ప్రపంచ క్వాంటం దినోత్సవం సందర్భంగా దేశంలోనే తొలి క్వాంటం పరీక్షా సదుపాయ కేంద్రాలను అమరావతిలో ప్రారంభించారు. ముప్పై సంవత్సరాల క్రితం సమాచార సాంకేతిక రంగంలో ముందడుగు వేసినట్లే, ఇప్పుడు క్వాంటం సాంకేతికత రంగంలో దేశానికే ముందు నిలవాలని ఆయన దృఢంగా నిలబడుతున్నారు. ఈ కేంద్రాల ద్వారా ఆంధ్రప్రదేశ్ యువతకు భవిష్యత్తులో అత్యున్నత స్థాయి ఉద్యోగ అవకాశాలు తెరుచుకుంటాయి. చిత్తూరు జిల్లాలోని శ్రీ సిటీలో ఇప్పటికే ఎల్జి ఎలక్ట్రానిక్స్, డైకెన్, ఇసుజూ వంటి ప్రపంచ ప్రఖ్యాత సంస్థలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. 2025లో శ్రీ సిటీలో రూ. 20,250 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఇవేవీ ప్రకటనలు కాదు . కార్యరూపం దాల్చిన పెట్టుబడులు. డావోస్కు వెళ్ళినా, అమెరికాకు వెళ్ళినా ఆయన పేరు చెప్పగానే గుర్తిస్తారు . కొత్తగా పరిచయం చేసుకోవాల్సిన అవసరం లేదు. కూటమి ప్రభుత్వం 20 నెలల కాలంలోనే దేశంలోకి వచ్చిన పెట్టుబడుల్లో నాలుగో వంతు ఆంధ్రప్రదేశ్కు ఆకర్షించింది. ఇది చిన్న విషయం కాదు, ఇది రాష్ట్రానికి చాలా పెద్ద బలం.

కానీ పెట్టుబడులు ఆకర్షించడం అంత సులభం కాదు. ఏ పెట్టుబడిదారుడైనా ముందు చూసేది . రోడ్లు ఉన్నాయా, విద్యుత్ నిరంతరంగా వస్తుందా, నీరు అందుతుందా, రేవుపట్టణానికి చేరుకోగలమా అని. మౌలిక సదుపాయాలు సిద్ధంగా లేకపోతే పెట్టుబడి పెట్టడం అంటే ఇసుకలో పునాది వేయడం వంటిది. అందుకే అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుండే అమరావతి పునర్నిర్మాణం, పోలవరం వేగవంతం, జాతీయ రహదారుల విస్తరణ తొలి ప్రాధాన్యతలు అయ్యాయి. ఇవి కేవలం నిర్మాణ పనులు కాదు . పెట్టుబడిదారుడికి పంపే సంకేతాలు. ఈ దిశలో మరో కీలకమైన అడుగు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం. ఉత్తరాంధ్ర ప్రజలు దశాబ్దాలుగా కలలు కంటున్న ఈ విమానాశ్రయం 2026 జులైలో ప్రారంభం కానుంది. దేశంలోనే అతి పెద్ద రన్వేతో నిర్మించబడుతున్న ఈ విమానాశ్రయం అందుబాటులోకి వస్తే విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలు ప్రపంచంతో నేరుగా అనుసంధానమవుతాయి. ఔషధ పరిశ్రమ ఎగుమతులు వేగంగా వెళ్తాయి, పర్యాటకం పెరుగుతుంది, కొత్త పరిశ్రమలు వస్తాయి. అదే సమయంలో రాయలసీమకు హంద్రీనీవా ద్వారా నీళ్ళు అందడం మొదలైంది . ఫేజ్ 1 కాలువ విస్తరణ పనులు పూర్తయి రూ. 696 కోట్లతో 3,850 క్యూసెక్కుల సామర్థ్యం పెరిగింది. ఆ నీళ్ళు పొలాలకు చేరితే రాయలసీమ పండ్ల సాగులో, తోటల పెంపకంలో దక్షిణ భారతదేశానికే కేంద్రంగా మారే సామర్థ్యం ఉంది. అలాగే ప్రతి యాభై కిలోమీటర్లకు ఒక చిన్న రేవు నిర్మించాలనే ప్రణాళిక . ఇది కేవలం వ్యాపారానికి మాత్రమే కాదు, మారుమూల మత్స్యకారులు నేరుగా మార్కెట్కు చేరే అవకాశం కూడా.

పెట్టుబడులు రావాలంటే ఆహ్వానం సరిపోదు . వాతావరణం సిద్ధంగా ఉండాలి. ఒక పెట్టుబడిదారుడు పరిశ్రమ పెట్టాలని నిర్ణయించుకున్నప్పుడు అతనికి అన్నిటికంటే ముందు కావాల్సింది సమయం. అనుమతులకు నెలలు పట్టే రాష్ట్రం కంటే వారాల్లో అన్నీ సిద్ధం చేసే రాష్ట్రం వైపు వెళ్తాడు. అందుకే ఇఖువ శీట ఇశీఅఅ్ర దీబంఱఅవం మాత్రమే కాదు . ూఱజూవవం శీట ఇశీఅఅ్ర దీబంఱఅవం అంతకంటే ముఖ్యం. ఒక్క సంతకం కోసం నెలల తరబడి తిరగాల్సిన పరిస్థితి పోవాలి, ంఱఅస్త్రశ్రీవ ఓఱఅసీశ ంవఎవఎ నిజంగా పనిచేయాలి, అనుమతులు శీఅశ్రీఱఅవ లో గడువులోపు వచ్చేలా వ్యవస్థ మారాలి. ఇది కేవలం సౌకర్యం కోసం కాదు . ఆంధ్రప్రదేశ్కు సమయం చాలా విలువైనది. రాష్ట్రాన్ని గాడిలో పెట్టడానికి ప్రతి రోజూ లెక్కే. పెట్టుబడిదారుడు వేచి ఉండరు . తెలంగాణ ఉంది, తమిళనాడు ఉంది, కర్ణాటక ఉంది. ఆంధ్ర వేగంగా కదలకపోతే ఆ అవకాశాలు పక్క రాష్ట్రాలకు వెళ్తాయి.

విభజన తర్వాత ఆంధ్రులలో ఒక సామూహిక అభద్రత పుట్టింది. “మనకు న్యాయం జరగలేదు” అనే బాధ నిజమైనదే, కానీ ఆ బాధ రాజకీయ ఆయుధంగా మారినప్పుడు అభివృద్ధి బదులు ఆందోళన మిగులుతుంది. ఈ మానసిక స్థితి నుండి బయటపడాలంటే “మనం సొంతంగా నిలబడగలం” అనే నమ్మకం కావాలి. ఆ నమ్మకాన్ని మాటలతో కాదు, కనిపించే ఫలితాలతో మాత్రమే ఇవ్వగలరు. అమరావతిలో పైకి లేచే క్రేన్లు, పోలవరం నుండి పొలాలకు చేరే నీళ్ళు, భోగాపురం ఆకాశంలో తొలిసారి వినిపించే విమాన శబ్దం, రాయలసీమ పొలాల్లో హంద్రీనీవా నీళ్ళతో పెరిగే పచ్చదనం, రాష్ట్ర ఖజానాలోకి వస్తున్న పన్ను ఆదాయం . ఇవి కేవలం నిర్మాణాలు కాదు, ప్రజల మనసులో నమ్మకాన్ని నిర్మించే చిహ్నాలు.

అయితే ఇక్కడ ఇంకో లోతైన సమస్య కూడా ఉంది . గత పాలకులు ఒక కొత్త రాజకీయ సంస్కృతికి తెర తీశారు. ప్రభుత్వం వచ్చిరాగానే ప్రజల సొమ్ముతో రాష్ట్ర అభివృద్ధి కోసం అంతకు ముందు ప్రభుత్వం చేసిన పనులు చెరిపేయడం. ఆంధ్రుల ఆత్మగౌరవం అమరావతిని పాడుపెట్టారు,జీవనాడి పోలవరం ఆపేశారు.ఇలాంటి వాతావరణం లో పెట్టుబడిదారులు రారు, ఎందుకంటే నేటి హామీ రేపటికి ఉంటుందో లేదో తెలియదు. పెట్టుబడి పెట్టాలంటే కనీసం పదేళ్ళు, ఇరవై ఏళ్ళ దీర్ఘకాలిక ప్రణాళిక చూసుకోవాలి. ప్రతి ఐదేళ్ళకూ విధానాలు మారుతుంటే ఏ పెట్టుబడిదారుడూ రాడు. అంటే రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ఇదే ప్రభుత్వం ఇంకో ఇరవయ్యేళ్ళు కొనసాగాలి అనేది అందరూ గుర్తుపెట్టుకోవాల్సిన ముఖ్యవిషయం.

చివరగా ఒక్క క్షణం ఆగి ఆలోచించండి. ఈ కష్టమైన సమయంలో . పది లక్షల కోట్ల అప్పులతో, ఆగిపోయిన రాజధానితో, పారిపోయిన పెట్టుబడులతో . ఒక మేధావి నాయకత్వం లేకుండా ఉంటే ఆంధ్రప్రదేశ్ ఎక్కడ ఉండేది? ఆ ప్రశ్న వేసుకుంటేనే గుండె ఆగినట్లు అనిపిస్తుంది. పెట్టుబడిదారులతో మాట్లాడగలిగే అనుభవం, ప్రపంచ వేదికలపై రాష్ట్రాన్ని ప్రాతినిధ్యం వహించగలిగే నైపుణ్యం, సాంకేతికతలో వస్తున్న మార్పులను ముందుగా పసిగట్టే దూరదృష్టి . ఇవి అందరికీ ఉండవు, అన్ని సమయాల్లో దొరకవు. సరైన సమయంలో సరైన వ్యక్తి ఉండటం అదృష్టం మాత్రమే కాదు . అది ఆ రాష్ట్రం పొందగలిగిన అత్యంత విలువైన వరం.

ఒక నాయకుడిని అర్థం చేసుకోవాలంటే అతని పగలు రాత్రి చూడాలి. చంద్రబాబు నాయుడు గారికి రాజకీయం కేవలం అధికారం కాదు . అది ఒక తపస్సు. రోజుకు 18 గంటలు ప్రజల కోసం పరితపించే ఈ నాయకుడికి విశ్రాంతి అంటే తెలియదు, విరామమంటే తెలియదు. ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకునే వరకూ . ఏ జిల్లాలో వరద వచ్చిందో, ఏ పరిశ్రమ పెట్టుబడి పెట్టాలనుందో, ఏ రైతుకు నీళ్ళు అందాయో అందలేదో . అన్నీ ఆయన మనసులోనే ఉంటాయి. ఇది ప్రదర్శన కాదు, ఇది జీవన విధానం. ప్రజా క్షేమాన్నే తన శ్వాసగా మార్చుకున్న నాయకుడు . అది అరుదైన వరం. అలాంటి నిబద్ధత, అలాంటి శ్రమ, అలాంటి దూరదృష్టి ఒకే వ్యక్తిలో కలిసి వచ్చినప్పుడు . ఆ రాష్ట్రం నిద్రపోయినా అభివృద్ధి మేల్కొని ఉంటుంది. ప్రజా క్షేమమే తన జీవితంగా మార్చుకున్న అలాంటి నాయకుడు చంద్రబాబు గారికంటే గొప్ప నాయకుడు మరెవరు ఉంటారు చెప్పండి.

ఆంధ్రప్రదేశ్కు ఇప్పుడు ఆ వరం దక్కింది. దాన్ని వృధా చేసుకోకుండా, ప్రతి పౌరుడూ తన వంతు బాధ్యత నిర్వర్తిస్తే . ఈ రాష్ట్రం తప్పకుండా నిలబడుతుంది. కేవలం నిలబడటమే కాదు, దక్షిణ భారతదేశానికే ఆదర్శంగా నిలుస్తుంది.

మన దగ్గర ఉన్న సంజీవని పర్వతం లాంటి చంద్రబాబు నాయుడు గారి విలువ తెలుసుకుంటే ఆంధ్రులు తరతరాలు ఆనందంగా ఉంటారు అనేది అక్షర సత్యం.



- అడుసుమిల్లి కృష్ణ ప్రియ,
అలబామా (అమెరికా)

## కోనసీమ కొంగు బంగారం, ఆకలి తీర్చిన
# “అన్నపూర్ణ” డొక్కా సీతమ్మ

### 127వ వర్ధంతి ఏప్రిల్ 28

ఆ ఇంటి దంపతుల లక్ష్యం ఒక్కటేగా ఉండేది. ఎవరు ఏ వేళలో వచ్చి భోజనమని అడిగినా లేదు, తర్వాత రా అనే పదాలే లేకుండా, ఆదరించి అన్నంపెట్టడం వారికి నిత్యకృత్యంగా మారింది. జోగన్న, సీతమ్మ దంపతులు చేసే ఆ అన్నదానం ఆనోట ఈనోట లంక గ్రామాల్లో పాకింది. ఇతర గ్రామాలనుంచీ పొలం పనులకు, కూలి పనులకు వచ్చే వాళ్ళు, ఊరి మీదుగా వెళ్ళే ప్రయాణికులు సీతమ్మ ఇంట ఆదరణ పొందేవారు. ఊరిని వరదలు ముంచేసిన రోజుల్లో కూడా వారి ఇల్లు అన్నాలయం గా మారి ఎందరికో దిక్కయ్యింది. వారి మానవతా విలువలు ఎందరో నాయకుల్ని కూడా కదిలించి వేసింది. 1909 ఏప్రిల్ 28 ఆమె స్వర్గస్తురాలైంది.

శుచి, శుభ్రతలతో బాటు ఆప్యాయతా, ఆదరణలకు వారి ఇల్లు పెట్టింది పేరుగా ఆ గ్రామమంతా చెప్పుకునేవారు. ఆ కాలంలో గోదావరి దాటాలంటే ఒకే ఒక ప్రయాణ సాధనం పడవ. జోగన్న ఊరు లంకగన్నవరం గోదావరికి మార్గమధ్యంలో ఉన్నందు వల్ల ప్రయాణీకులు అలసి అక్కడకు చేరేవారు. అలాటివారికి అన్నపానాలు సమకూర్చడం సీతమ్మ భర్తతో కలిసి చేస్తుండేది. గోదావరికి తరచు వచ్చే వరద కారణంగా, అతివృష్టి, అనావృష్టి కారణంగా పలు ఇబ్బందులకు గురయ్యే ఆ ప్రాంత గ్రామాల పేదలను వచ్చిన వారికి లేదనకుండా నిత్యాన్నదానము జరిపిన మహా ఇల్లాలు. నిస్వార్థంగా అన్నార్తులందరికీ మాతృప్రేమను పంచి జీవితాన్ని చరితార్థం చేసుకున్న డొక్కా సీతమ్మ అచిరకాలంలోనే ఉభయ గోదావరి జిల్లాలలో ‘అపర అన్నపూర్ణ’ గా పేరు పొందింది

రోడ్డు మీద వెళుతూ ‘అమ్మా’ అని అడిగిన వారి మనసులో భావాల్ని, వారి ఆకలిని అర్థం చేసుకునే మహిళా శిరోరత్నం -- అపర అన్నపూర్ణమ్మ -- శ్రీమతి డొక్కా సీతమ్మ. ఆమె పుట్టి, పెరిగింది అచ్చ తెలుగు వాకిళ్ళల్లో, మెట్టింది సాంప్రదాయపు లోగిళ్ళల్లో, అందునా గోదారి ముంగిలి.... గోదావరి జిల్లాల్లో డొక్కా సీతమ్మ పేరు కొత్త కాదు. ఆకలిగొన్న వారికి అన్నం పెట్టడమే ధ్యేయంగా ‘అతిథి దేవోభవ’ అనే వాక్యానికి దర్పణంగా నిలిచి అన్నదానంచేసి, విశ్వమానవతకు అద్దం పట్టిన మహిళామణి ఆమె. సీతమ్మ పుట్టినింట నేర్చుకున్న విషయాలు, అత్తవారింట అలవరచుకున్న గొప్ప నడవడి అతిథి మర్యాద, అన్నదానం ఆమెను గొప్ప స్త్రీమూర్తిగా తీర్చి దిద్దాయి.

గోదారి ప్రాంతాల్లో కంటి ముందే గంగమ్మ, కనుచూపు మేరంతా పచ్చని పంట, కన్న పిల్లలతో సమానమైన పాడి, పొద్దున్న లేస్తే మన అని పలకరించే పది మంది. మనిషి సంతోషంగా జీవించడానికి ఇంతకన్నా ఏం కావాలి? ప్రజలు గొప్ప అదృష్టవంతులు అలసి ఆకలి తో ఉన్న వారికి కొన్ని దశాబ్దాల పాటు ఆమె అలసి పోకుండా వండి వార్చి వడ్డించింది. ఆమె కులం మతం, అర్ధ రాత్రుల్ని లెక్కచెయలెదు. వరదలు, వర్షాలకు జంకలేదు. ఒకనాడైన ప్రతిఫలం ఆశించింది కాదు, మిగిలేది ఏమిటన్న ఆలోచన మనసులో ఆమె రానివ్వలెదు.

**పట్టాభిషేక వేడుకలకు కింగ్ ఎడ్వర్డ్ ఆహ్వానం**

. మహిళలకే గర్వకారణం గా మారిన ఆ తల్లి సీతమ్మ పేరు ఇంగ్లాండు వరకు వినిపించింది. ఆమె గొప్ప మాతృత్వ విలువలకు మెచ్చిన బ్రిటీష్ ప్రభుత్వం ఆమె దాతృత్వాన్ని గుర్తించి ఆమెను సత్కరించుకోవాలని తపన పడింది. 7వ కింగ్ ఎడ్వర్డ్ ఆమెను ప్రతి యేటా ఢిల్లీ లో జరిగే తన పట్టాభిషేక వార్షికోత్సవ వేడుకలకు భారతదేశంలోని ఇతర అతిథులతో కలిసి ఆహ్వానించారు. గౌరవంతో ఆమెను ఢిల్లీకి తీసుకురావాలని ఆయన మద్రాస్ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు,

సీతమ్మ మర్యాదగా ఆహ్వానాన్ని తిరస్కరించింది, ప్రచారం కోసం ఆమె తన సేవలను అందించడం లేదని అన్నారు. బదులుగా మద్రాసు ప్రధాన కార్యదర్శి కలెక్టర్ ద్వారా సేకరించిన ఆమె ఫోటోను కింగ్ ఎడ్వర్డ్ కు ఇచ్చారు. దాన్ని నిలువెత్తు సజీవ చిత్రంగా మార్పించి, మొదటి వరసలో, ఆహూతుల సమక్షంలో ఉంచి, ఢిల్లీలో పట్టాభిషేకం చేసుకున్నాడట చక్రవర్తి. స్వాతంత్రం వచ్చాక, ఆ చిత్ర పటాన్ని కొన్నేళ్ళు బ్రిటిష్ పార్లమెంట్ లో ఉంచారట. తరువాత అది ఇంగ్లాండులోని మ్యూజియంలో పెట్టారు.

1841 లో పుట్టిన నాటినుండి 1909లో మరణించేవరకూ వరకూ ఈమె చరిత్ర సెకండరీ పాఠశాల తెలుగు పాఠ్యాంశంగా చేర్చారు. గన్నవరం గోదావరి నదిపై కల అక్విడెక్ట్ కు ఆమ్ సంస్మరణార్థం డొక్కాసీతమ్మ అక్విడెక్ట్ అని నామకరణం చేసారు. ఆంధ్ర దేశపు కీర్తి పతాకను




ఇంగ్లండు వరకు వ్యాపింపజేసి, మాతృప్రేమను అతిథులకుపంచి, జీవితాన్ని చరితార్థం చేసుకున్న అపర అన్నపూర్ణ డొక్కా సీతమ్మ.

**ప్రభుత్వ కాలువకు డొక్కా సీతమ్మ నామకరణం**

అక్కడ కట్టిన ఓ కాలువకు ప్రభుత్వం డొక్కా సీతమ్మ పేరిట నామకరణం చేసి గౌరవించుకుంది. ఆ వేడుకలో ఆమె కూర్చునే కుర్చీపై ఆచిత్రపటాన్ని ఉంచి ఆమె వచ్చినంత సంబరపడ్డారట. 2000లో వైనతేయ నదిపై ఒక అక్విడెక్ట్ కు ప్రభుత్వం ఆమె పేరు పెట్టి, ఆమె చిత్రపటానికి ప్రతిమ రూపం కల్పించారు. ఆమె కేవలం అన్న దానమే కాదు, ఎన్నో పెళ్ళిళ్ళకూ, ఇతర శుభకార్యాలకూ విరాళాలు యిచ్చిన దాత కూడా. చందాల రూపంలో కాని, విరాళాల రూపంలో కాని ఎవరి వద్దా ఏమీ తీసుకోని కారణంగా, ఆస్తిపాస్తులు మిగలని కారణంగా ఆమె వంశస్తులు ఆమె తదనంతరం ఎక్కువకాలం ఈ వితరణ జరపలేకపోయారు. 1970 ల వరకు కాశీ గర్భగుడిలో అన్నపూర్ణ సమక్షంలో సీతమ్మ ఫొటో ఉండేదట.

**మండపేటలో 1841 అక్టోబరులో జననం**

మద్రాసు ప్రెసిడెన్సీ రాజమండ్రి జిల్లా (ప్రస్తుతం కోనసీమ జిల్లా, ఆంధ్ర ప్రదేశ్) మండపేటలో 1841 అక్టోబరు రెండోవారంలో అనుపిండి భవానీ శంకరం, నరసమ్మ దంపతులకు సీతమ్మ జన్మించింది. నిత్యం అన్నదానం చేసే సీతమ్మ నాన్నను “బువ్వయ్య”అని పిలిచేవారు. చిన్ననాటి సీతమ్మకు తల్లి, తండ్రి గురువులై కథలు, గాథలు, పాటలు, పద్యాలు అన్నీ నేర్పారు. స్త్రీ విద్య నేర్చుకునే అవకాశాలు అంతగా లేని కాలంలో సాంప్రదాయాలకు బద్ధురాలై, పెద్దబాలశిక్ష కూడా పూర్తిగా చదవకుండానే ఆమె పెళ్ళి జరిగింది. బాల్యంలోనే ఆమె తల్లి నరసమ్మ కాలం చేస్తే, ఇల్లు చక్కదిద్దే భారం సీతమ్మపై పడింది. గోదావరి నది పాయలలోని లంకగన్నవరంలో సంపన్న కుటింబీకుడు డొక్కా జోగన్న పంతులు. పెద్ద రైతే కాకుండా, వేద పండితుడు కూడా. ఆయనకు సాముద్రిక శాస్త్రంలో కూడా ప్రవేశం ఉంది.

ఒక రోజున పండిత సభకు వెళ్లి వస్తూ మండపేట వచ్చేటప్పటికి మధ్యాహ్నమవడం వలన, భవానీ శంకరం ఆహ్వానంపై వెళ్లి ఆ పూట వారి ఆతిథ్యం స్వీకరించాడు. జోగన్నకు ఆతిధ్యం ఇవ్వడం పట్ల సీతమ్మ చూపించిన ఆదరాభిమానాలు, మర్యాద, అణకువ కూడా నచ్చి యవ్వనంలో ఉన్న సీతమ్మను పెళ్ళిచేసుకోవాలనే కోరిక తెలపగా, బువన్న సీతమ్మను డొక్కా జోగన్నకు ఇచ్చి వైభవంగా పెళ్ళి జరిపించాడు. సీతమ్మకు మెట్టినింట్లో అడుగు పెట్టగానే డొక్కా ఇంటి పేరుగా మారింది. ఆమెకు వయసుతో బాటు ఉదార గుణం కూడా నానాటికీ పెంపొందసాగింది. జోగన్న – సీతమ్మ దాంపత్యం అన్యోన్యమైనది. ఆ పుణ్య దంపతులను చూసి ఆనందించనివారు లేరనేవారు. . భర్త జోగన్న ధనం, దానగుణం, సహకారం ఉన్నవారు, ఆయన రైతు బిడ్డ. సీతమ్మ చేసే గొప్ప పనికి ఆయన నిత్యం చేతోడుగా ఉండేవారు.



- నందిరాజు రాధాకృష్ణ,
వెటరన్ జర్నలిస్ట్,
98481 28215

**పాఠకులకు విజ్ఞప్తి**

‘రేపటికోసం’ పత్రికకు సంబంధించి మీ విలువైన సూచనలు, అభిప్రాయాలు ఈ క్రింది మెయిల్‌కు పంపగలరు. repatikosamdaily@gmail.com

# నగర ప్రజలకు ఊరట కల్పిస్తాం



**గుంటూరు సిటీ బ్యూరో రేపటి కోసం:** నగరంలో వేసవి ఎండ నుండి ప్రజలకు ఉపశమనం కల్గించేలా జిఎంసి ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా వాహనదారులు, పాదచారులు వడ దెబ్బ బారిన పడకుండా ఉండేందుకు ట్రాఫిక్ సిగ్నల్స్ దగ్గర గ్రీన్ మ్యాట్ల ఏర్పాటు, ప్రధాన రోడ్ల పై నీటిని స్ప్రే చేయడం, అలాగే చల్లని నీటితో చలివేంద్రాలు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద వాహనదారులు ఎండలో వేచి ఉండటం వల్ల వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంటుందని, దీనిని నివారించేందుకు అన్ని ప్రధాన కూడళ్లలోని సిగ్నల్స్ వద్ద రోడ్డుకు ఇరు వైపులా ఎత్తైన గ్రీన్ మ్యాట్లను ఏర్పాటు చేశామని, తద్వారా వాహనదారులు నీడలో ప్రశాంతంగా వేచి ఉండే వీలుంటుందన్నారు. ఇప్పటికే హిందూ కాలేజి, హిమని జంక్షన్లలో ఏర్పాటు పూర్తి అయిందని, మంగళవారానికి బృందావన్ గార్డెన్స్, లక్ష్మీపురం మదర్ థెరిస్సా విగ్రహం దగ్గర ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించామన్నారు. అదేవిధంగా, నగర ప్రజల దాహార్తిని తీర్చేందుకు కార్పొరేషన్ ఆధ్వర్యంలో మరియు స్వచ్ఛంద సంస్థల సహకారంతో నగరంలోని రద్దీ ప్రాంతాలైన బస్టాండ్లు, రైల్వే స్టేషన్ పరిసరాలు, మార్కెట్లు మరియు ప్రభుత్వ కార్యాలయాల వద్ద ప్రత్యేకంగా చల్లని నీటితో చలివేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతి చలివేంద్రం వద్ద పరిశుభ్రత పాటించాలని, నిరంతరం నీటి నిల్వ ఉండేలా సిబ్బంది పర్యవేక్షించాలని ఆయన ఆదేశించారు. అలాగే ప్రధాన రోడ్లపై ఎండ తీవ్రత తగ్గించేలా నీటిని స్ప్రే చేయిస్తున్నామన్నారు. ప్రజలు కూడా ఎండల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు మధ్యాహ్నం 12 గం.ల నుండి సా.4 గంటల వరకు బయటకు రాకుండా ఉండటం శ్రేయస్కరమని సూచించారు.

# తెలుగు భాషా వికాసవేత్త మండలి వెంకట కృష్ణారావు



**గుంటూరు సిటీ బ్యూరో రేపటి కోసం:** ప్రథమ ప్రపంచ తెలుగు మహాసభల నిర్వహక అధ్యక్షునిగా మహాసభలను విజయవంతంగా నిర్వహించి, దేశ విదేశాలలో తెలుగు భాష ఉన్నతికి విశేష కృషి చేసిన మహనీయుడు మండలి వెంకటకృష్ణారావు అని ది ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్ట్ కార్యదర్శి రామచంద్ర రాజు అన్నారు. సోమవారం భారతీయ విద్యాభవన్‌నందు "మహా పురుషుడు మండలి" గోడ ప్రతిని ఆవిష్కరించిన అనంతరం రామచంద్ర రాజు మాట్లాడుతూ కీర్తిశేషులు మండలి వెంకటకృష్ణ రావు సమితి అధ్యక్షునిగా, కృష్ణా జిల్లా పరిషత్ ఉపాధ్యక్షునిగా, శాసనసభ సభ్యునిగా, పార్లమెంట్ సభ్యునిగా, రాష్ట్ర మంత్రిగా ప్రజాసేవలో పునీతమైన మహనీయుడు కృష్ణారావుని కొనియాడారు. శత జయంతి ఉత్సవాల సందర్భంగా ది ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్ట్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత సంస్కృతి సమితి, బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్, మేలుకొలుపు అసిస్ట్ సంస్థల ఆధ్వర్యంలో మండలి కృష్ణారావు సేవలను స్మరించుకుంటూ "మహా పురుషుడు మండలి" అను నాటకాన్ని ఏప్రిల్ 29వ తేదీ బుధవారం సాయంత్రం వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ప్రదర్శించనున్నట్లు, అధునాతన ఏఐ పరిజ్ఞానాన్ని వినియోగించి నాటక ప్రదర్శనలో దివిసీమ ఉప్పెనను కళ్ళకు కట్టినట్లు చూపించుటయే గాక ప్రేక్షకులను మంత్రముగ్ధులను కావించనున్న ఈ నాటకాన్ని ప్రతి ఒక్కరూ తిలకించాలని ఆయన చెప్పారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణ్ రెడ్డి మాట్లాడుతూ 1977 నవంబర్లో సంభవించిన దివిసీమ ఉప్పెనయందు మండలి కృష్ణారావు చేసిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు. ప్రముఖ రంగస్థల నటుడు, రచయిత డా. ఎన్. రవి కుమార్, రంగస్థల దర్శకులు గంగోత్రిసాయి, నాటక రచయిత కావూరి సత్యనారాయణ, నటులు దేగల వెంకటేశ్వరరావు, ప్రజా గాయకులు పివి రమణ, హిందూ కళాశాల పూర్వ వైస్ ప్రిన్సిపల్ కె వి ఎస్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాజావాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు జయంతి



**మంగళగిరి (గుంటూరు) రేపటి కోసం:** శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం లో గాలిగోపురాన్ని నిర్మించిన మహానుభావుడు రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు జయంతి సందర్భంగా సోమవారం ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉన్న రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు వారి చిత్రపటానికి దేవస్థానం ఈవో, ధర్మకర్తల మండలి సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన అధికారులు, ధర్మకర్తల మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## గంజాయి విక్రయాలపై ప్రత్యేక దాడులు



**గుంటూరు పశ్చిమ రేపటి కోసం :** గుంటూరు జిల్లా పరిధిలో గంజాయి అక్రమ రవాణా, వినియోగం మరియు విక్రయాలపై మంగళగిరి రూరల్, దుగ్గిరాల పోలీస్ స్టేషన్ల పరిధిలో నిర్వహించిన ప్రత్యేక దాడుల్లో మొత్తం 27 మంది నిందితులను అరెస్ట్ చేయడం జరిగింది. వీరి నుండి మొత్తం సుమారు 4.6 కిలోల గంజాయి, రూ.3600 నగదు స్వాధీనం చేసుకున్నారు.

## సామూహిక మరుగుదొడ్ల గ్రామ పరిశుభ్రతకు నాంది



**ప్రత్తిపాడు (గుంటూరు) రేపటి కోసం:** ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయం లో సోమవారం స్వచ్ఛ భారత్ మిషన్ ఫేజ్ (గ్రామీణం) -2 లో భాగంగా జిల్లా పంచాయతీ శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం నందు సామూహిక మరుగుదొడ్ల అంశంపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఎంపిడిఓ కె శివపార్వతి అధ్యక్షతన ఈ కార్యక్రమంలో గ్రామంలో ప్రతి ఇంటికి మరుగు దొడ్డి నిర్మాణం పూర్తి చేసి, వాటిని వినియోగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని, ఎవరికి ఐతే గ్రామంలో టాయిలెట్ నిర్మాణం జరగలేదో, ఇతర ప్రాంతాల నుండి ఉపాధి కోసం వలస వచ్చిన వారి కోసం గ్రామంలో సామూహిక మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని ఎంపిడిఓ తెలిపారు. టాయిలెట్ నిర్మాణం చేసుకోలేని వారికి, స్త్రీల ఆత్మ గౌరవం దెబ్బ తినకుండా ఉండటానికి, అంటు వ్యాధుల నిర్మూలనకు ఇతర అంశాలను పరిగణ లోకి తీసుకొని వీటి నిర్మాణం చేపట్టడం జరుగుతుందని డిప్యూటీ ఎంపిడిఓ షేక్ ఆదాం షఫీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ కె శివపార్వతి, డిప్యూటీ ఎంపిడిఓ షేక్ ఆదాం షఫీ, ఎంఓటిగా ఈ వి ఎస్ రెడ్డితో పాటు మండలంలో అన్ని గ్రామాల పంచాయతీ డెవలప్మెంట్ అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ లు పాల్గొన్నారు.

## చిత్రకళలు మన సంస్కృతికి ప్రతిబింబం

**గుంటూరు, సిటీ బ్యూరో రేపటి కోసం:** నగరంలో వేలటూరి ఆర్ట్ అకాడమీ నిర్వహించిన అతిపెద్ద కళా ఉత్సవానికి ముఖ్య అతిథిగా ప్రత్తిపాడు నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ బూర్ల రామాంజనేయులు పాల్గొన్నారు. శాసనసభ్యులు మాట్లాడుతూ విద్యార్థులు యువతలో సృజనాత్మకతను ప్రోత్సహించేందుకు నిర్వహించిన ఆర్ట్ ఫెస్టివల్ ఎంతో విజయవంతంగా జరిగిందన్నారు. కళాకారులకు ప్రోత్సాహం అందించడం, మన సంప్రదాయ కళలను భావితరాలకు పరిచయం చేయడం కూటమి ప్రభుత్వ లక్ష్యం .ఈ వేడుకలో చిత్రలేఖనం, శిల్పకళ, హస్తకళలు, సాంప్రదాయ కళారూపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కళాకారులు తమ ప్రతిభను ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. విద్యార్థులు, యువత ఉత్సాహంగా పాల్గొని తమ సృజనాత్మకతను చాటిచెప్పారు. కళలను ప్రోత్సహించడం ద్వారా సమాజంలో మంచి భావాలు పెంపొందుతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన వేలటూరి ఆర్ట్ అకాడమీ వారికి, విద్యార్థులకు, తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు.

# ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలను తొలగించండి

**గుంటూరు సిటీ బ్యూరో రేపటి కోసం:** నగర ప్రజల ఆరోగ్యం, పారిశుద్ధ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నగర పాలక సంస్థ పరిధిలోని ఖాళీ స్థలాల యజమానులు తమ స్థలాల్లో పెరిగిన పిచ్చి మొక్కలను వెంటనే తొలగించి శుభ్రం చేసుకోవాలని, ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా మట్టితో పూడ్పించుకోవాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకవేళ ఈ ఆదేశాలను పాటించని పక్షంలో, నగర పాలక సంస్థ చట్టంలోని 496, 504, 639, 640 641 సెక్షన్ల ప్రకారం నోటీసులు జారీచేసి, నోటీసు ఇచ్చిన 7 రోజుల తర్వాత కూడా యజమానులు స్పందించని యెడల, జిఎంసి ఖర్చుతోనే ఆ స్థలాలను శుభ్రం చేయించి, ఆ ఖర్చును సదరు యజమాని నుండి ఆస్తి పన్ను బకాయి మాదిరిగా వసూలు చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నగరంలోని మురుగు కాలువలు, ఖాళీ స్థలాలు మార్కెట్ప్రాంతాల్లో ఇష్టానుసారం చెత్త వేయడం సరికాదని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కొందరు ప్రజలు, వ్యాపారులు డస్ట్ బిన్లు వాడకుండా నేరుగా చెత్తను కాలువల్లో వేయడం వల్ల అవి పూడిపోయి, మురుగు నీరు రోడ్ల పైకి ప్రవహిస్తోందని, దీనివల్ల కలరా, టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. నగరంలోని ప్రతి హోటల్, ఫంక్షన్ హాల్ వ్యాపార సముదాయం తప్పనిసరిగా డస్ట్ బిన్లను ఏర్పాటు చేసుకుని, సేకరించిన చెత్తను కమర్షియల్ చెత్త సేకరణ వాహనాల ద్వారా మాత్రమే తరలించాలని ఆదేశించారు. ప్రజారోగ్య కార్మికులు కాలువల్లో చెత్త పేరుకుపోకుండా గ్రిల్స్ ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో కూడా నిరంతరం శుభ్రం చేస్తున్నామని, నగర ప్రజలందరూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలని కోరారు.

# ఘనంగా వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు జయంతి



**గుంటూరు, సిటీ బ్యూరో రేపటి కోసం:** అమరావతి ప్రభువు వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు 266వ జయంతిని అత్యంత ఘనంగా నిర్వహించారు. రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు జయంతి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు చిత్ర పటానికి వాసిరెడ్డి వంశానికి చెందిన 6వ తరం వారసుడు, అమరావతి సంస్థానం ఫౌండర్ ట్రస్టీ శ్రీమంత్ రాజా వాసిరెడ్డి సుధా స్వరూప్ మన్నే సుల్తాన్ బహదూర్‌తో కలసి జిల్లా రెవిన్యూ అధికారి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా రెవిన్యూ అధికారి మాట్లాడుతూ వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు ప్రజాహిత పాలన, ధార్మికత, అభివృద్ధి దృక్పథం నేటి తరాలకు మార్గదర్శకమని పేర్కొన్నారు. సమాజ సంక్షేమం కోసం ఆయన చూపిన దారిని అనుసరించడం అవసరమని తెలిపారు. వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు ఆంధ్రదేశ చరిత్రలో అపూర్వమైన జమీందారు, పరిపాలనలో దిట్ట అన్నారు.గుంటూరు, కృష్ణా ప్రాంతాలను సమర్థంగా పరిపాలిస్తూ శాంతి భద్రతలను బలోపేతం చేసి ప్రజల విశ్వాసాన్ని పొందారని చెప్పారు. ఆయన పాలనలో వ్యవసాయం విస్తృతంగా అభివృద్ధి చెందిందన్నారు. అమరావతిని రాజకీయ, సాంస్కృతిక కేంద్రంగా తీర్చిదిద్దిన మహానుభావుడిగా ఆయన చరిత్రలో చిరస్థానం సంపాదించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖ పర్యవేక్షక ఇంజనీర్ వెంకట రత్నం, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎం.పద్మావతి, ఉద్యాన శాఖ ఉప సంచాలకులు రవీంద్ర బాబు, ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎస్.ఎస్.వి.రమణ, ఇన్ ఛార్జ్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి శ్రావణ్ బాబు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్, జిల్లా పర్యాటక అధికారి రమ్య, దేవదాయ ధర్మదాయ శాఖ సహాయ కమిషనర్ మాధవి తదితరులు పాల్గొన్నారు.

# పీజీఆర్ఎస్‌కు 499 అర్జీలు



**గుంటూరు, సిటీ బ్యూరో రేపటి కోసం:** జిల్లాలో పి.జి.ఆర్.ఎస్ కు మొత్తం 499 అర్జీలు అందాయి. అందులో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన పి.జి.ఆర్.ఎస్ కు 250, పోలీస్ సూపరింటెండెంట్ కార్యాలయంలో జరిగిన పి.జి.ఆర్.ఎస్‌కు 186 అర్జీలు, గుంటూరు రెవిన్యూ డివిజన్ పరిధిలో 4 అర్జీలు, తెనాలి రెవిన్యూ డివిజన్ పరిధిలో 16 అర్జీలు, నగర పాలక సంస్థకు 36, మిగిలిన మున్సిపాలిటీల పరిధిలో 7 అర్జీలు అందాయి. సోమవారం ఎస్ ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. అర్జీదారులు పింఛన్లు, రేషన్ కార్డులు, గృహాలు మంజూరు చేయాలని, భూ సమస్యలు, వ్యక్తిగత సమస్యల పరిష్కారం చేయాలని కోరుతూ అర్జీలను సమర్పించారు. నగరంలోని నెహ్రూ నగర్ నుండి ఉమామహేశ్వరి అనే మహిళ అర్జీని సమర్పిస్తూ మహిళా సంఘం నుండి రావలసిన డబ్బులు ఇవ్వడం లేదని, తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రత్తిపాడు మండలం యనమదల గ్రామం నుండి గుళ్ళ పానకాలు అర్జీని సమర్పిస్తూ పొలం ఆక్రమణకు గురి అయ్యిందని, చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రత్తిపాడు మండలం బొంతపాడు గ్రామం నుండి శుద్ధపాడు మేరీ అర్జీ సమర్పిస్తూ వికలాంగ పింఛను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

## 'వాసిరెడ్డి'కి ఘన నివాళి



**గుంటూరు పశ్చిమ రేపటి కోసం:** సోమవారం గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో అమరావతి సంస్థానాధీశులు, ప్రజా రంజక పాలకుడు రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు జయంతి ఘనంగా నిర్వహించబడింది. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలోని అధికారులు సిబ్బంది రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. సంకురయ్య ఏ.ఆర్. డి.ఎస్.పి రామకృష్ణారెడ్డి హోంగార్డు ఆర్.ఐ, ఏ ఆర్ ఎస్ ఐ. కే. శ్రీనివాసరావు, జిల్లా పోలీస్ కార్యాలయ పరిపాలనా అధికారి,వివిధ విభాగాల సెక్షన్ సూపరింటెండెంట్లు పోలీస్ సిబ్బంది ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు కేవలం పాలకుడు మాత్రమే కాదని, కళలను, సంస్కృతిని ప్రోత్సహించిన మహనీయుడని కొనియాడారు.

# మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం



**మంగళగిరి (గుంటూరు) రేపటి కోసం:** పెదవడ్లపూడి గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో మంత్రి నారా లోకేష్ చొరవతో, దివీస్ లాబొరేటరీస్ వారి సహకారంతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను సోమవారం రాష్ట్ర పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీ దేవి, మంగళగిరి మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్,మండల పార్టీ అధ్యక్షులు పల్లబోతుల శ్రీనివాసరావులు ప్రారంభించారు.ఈ సందర్భంగా నందం అబద్దయ్య మాట్లాడుతూ గ్రామ ప్రజలకు నాణ్యమైన తాగునీరు అందించేందుకు మంత్రి నారా లోకేష్ దివీస్ లాబోరేటోరీస్ వారి సహకారంతో వాటర్ ప్లాంట్ ఏర్పాటుచేయించారని,ప్రజల అవసరాలను గుర్తించి వెంటనే స్పందించే నాయకత్వం నారా లోకేష్‌దని కొనియాడారు.పెదవడ్లపూడి గ్రామానికి మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం ద్వారా గ్రామస్తుల ఆరోగ్య పరిరక్షణకు తోడ్పాటు అందిందన్నారు. ఈ సహకారం అందించిన దివీస్ లాబొరేటరీస్ యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ మంత్రి నారా లోకేష్‌కు, దివీస్ సంస్థ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు యేళ్ళ శివరామయ్య, మాదల రమేష్ బాబు, చిట్టిబొమ్మ వెంకటేశ్వరరావు, అన్నే చంద్ర శేఖర్, మారెళ్ల సాంబశివరావు, కఠారి సాంబయ్య, జాలాది సందీప్, భావన సాంబులు, బోయపాటి రమేష్, మీనిగల వెంకటేష్, బొర్ర శ్రీకాంత్, కొప్పాక ఓంకార్, అమ్మయ్య చౌదరి, కొండపల్లి కిషోర్, యేళ్ళ మల్లయ్య, జవ్వాది రామారావు పాల్గొన్నారు.

## 42 మంది విద్యార్థులకు ఉద్యోగాలు

**మేడికొండూరు (గుంటూరు)రేపటి కోసం:** ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన ప్రతిష్టాత్మక ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో ప్రముఖ సంస్థ ఎమ్వీవీ సోలార్ కంపెనీ ద్వారా 42 మంది పాలిటెక్నిక్ విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక కావడం విశేషం.ఈ నియామక ప్రక్రియను నిర్వహించిన హెచ్ఆర్ డిప్యూటీ మేనేజర్ మోహన్ మాట్లాడుతూ, విద్యార్థుల సాంకేతిక నైపుణ్యం, కమ్యూనికేషన్ సామర్థ్యం, పరిశ్రమల అవసరాలకు సరిపడే ప్రతిభ ఎంతో ఆకట్టుకుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తిలక్‌బాబు, ఇంజినీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ డా.దోలా సంజయ్, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ రవి కుమార్, వైస్ ప్రిన్సిపాల్ మనోహర్, ప్లేస్‌మెంట్ కోఆర్డినేటర్ జీవన విద్యార్థులను అభినందించారు.

# నిర్ణీత గడువులోగా సమస్యలను పరిష్కరించండి



**గుంటూరు సిటీ బ్యూరో రేపటికోసం:** ప్రజల నుండి అందే అర్జీలను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ (ఇంచార్జి) జి. సాంబశివరావు విభాగాదిపతులకు తెలిపారు. సోమవారం నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ ఆదేశాల మేరకు జిఎంసి కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో అదనపు కమిషనర్ (ఇంచార్జి) పాల్గొని ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ (ఇంచార్జి) మాట్లాడుతూ, పిజిఆర్ఎస్ కు అందే ఫిర్యాదుల్లో ఎక్కువగా పారిశుధ్యం, డ్రైనేజీ సమస్యలు, తాగునీటి సరఫరా, వీధి దీపాల వంటి మౌలిక సదుపాయాలకు సంబంధించినవే వస్తున్నాయని, వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. అర్జీల పరిష్కారంలో ఏదైనా ఇబ్బందులు ఎదురైతే, ఆ విషయాన్ని దరఖాస్తుదారునికి వివరించి, ఎండార్స్మెంట్ ఇవ్వాలన్నారు. నిర్ణీత గడువు లోగా పరిష్కారంచూపని అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పిజిఆర్ఎస్ ద్వారా 36 అర్జీలు అందాయని, వాటిలో పట్టణ ప్రణాళిక విభాగం 12, ఇంజినీరింగ్ విభాగం 14, రెవెన్యూ విభాగం 8, ప్రజారోగ్య విభాగం 1, అకౌంట్స్ విభాగానికి సంబంధించి 1 ఫిర్యాదు అందాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సిహెచ్.శ్రీనివాస్, ఎస్ఈ వెంకటేశ్వరరావు, ఎంహెచ్ఓ డాక్టర్ సురేష్, డిసిపి సూరజ్ కుమార్, మేనేజర్ బాలాజీ బాష పాల్గొన్నారు.

# బంకులను తనిఖీ చేసిన కలెక్టర్

**గుంటూరు, సిటీ బ్యూరో రేపటికోసం:** జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ సోమవారం పెట్రోల్ బంకులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. నగరం పాలెం భారత్ పెట్రోల్ బంకును, వెంకటప్పయ్య కాలనీలోని హెచ్.పి పెట్రోల్ బంకును జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. బంకులలో ఇంధన నిల్వలు, విక్రయాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇంధనం కోసం వచ్చిన వినియోగదారులతో ముఖాముఖి మాట్లాడి పరిస్థితులను ఆరా తీసారు.జిల్లాలో పెట్రోల్, డీజిల్ నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలో ప్రజలకు అవసరమైన మేరకు ఇంధన సరఫరా నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలు అపోహలకు లోనుకావద్దని కోరారు. పెట్రోల్ బంకుల్లో సరఫరా వ్యవస్థను పర్యవేక్షిస్తూ ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా పనిచేస్తోందని తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా సమస్యలు ఉంటే ఆయిల్ కంపెనీ వారిని సంప్రదించి స్టాక్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి బంక్ వద్ద ఒక ఉద్యోగిని నియమించి పర్యవేక్షణ చేస్తున్నామని చెప్పారు. సోమవారం ఉదయం నుంచి అధికారులు తనిఖీలు చేశారని, సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## దీక్షితులకు శ్రీనివాస సేవా పరాయణ బిరుదు ప్రదానం



**తెనాలి, ( గుంటూరు జిల్లా) రేపటి కోసం :** తిరుమల తిరుపతి దేవస్థానముల మీరాశి అర్చకులు కంకణ బట్టు ఆగమ సలహాదారు వైఖానస ఆగమ పండితులు శ్రీమాన్ అర్చకం అనంతశయన దీక్షితులకు శ్రీనివాస సేవా పరాయణ బిరుదు ప్రధానం చేశారు. పట్టణంలోని కొత్తపేటలోగల అష్టలక్ష్మి ఆలయ ప్రాంగణంలో అర్చకులు నల్లూరు శ్రీనివాస చక్రవర్తి దంపతులు ఆధ్వర్యంలో ఏకాదశి దీక్ష వ్రతం ఉద్వాసన పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అనంతశయనం దీక్షితులు దంపతులకు పాదపూజ నిర్వహించి వేదమంత్రాల నడుమ సత్కరించారు. వైఖానస సేవా సంఘం అధ్యక్షులు మేదూరి శ్రీనివాసమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అష్టలక్ష్మి ఆలయ కమిటీ సభ్యులు భక్త బృందం పక్షాన దీక్షితులు సేవలను కొనియాడుతూ శ్రీనివాస సేవా పరాయణా బిరుదును ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవంతుని అనుగ్రహం పొందాలంటే సంకల్పం బలంగా ఉండాలన్నారు.తెనాలి పట్టణం ఆధ్యాత్మిక నిలయంగా వెలుగొందుతున్నదని ఆధ్యాత్మికతతో పాటు కళా రంగానికి కూడా పట్టణానికి ఎంతో పేరు ఉన్నదన్నారు. ఇలాంటి ఆంధ్ర ప్యారిస్ గా గుర్తింపు పొందిన పట్టణంలో భక్తులు పలువురు పండితుల సమక్షంలో తనకు సత్కారం బిరుదు ప్రధానం జరగడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు.

## పాస్టర్లకు అసోసియేషన్ సహాయకారిగా ఉంటుంది



**తెనాలి,( గుంటూరు జిల్లా) రేపటి కోసం :** పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తెనాలి మాస సమావేశాన్ని అసోసియేషన్ సభ్యుడు పాస్టర్ మంచికల షాలెం రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. సోమవారం పట్టణంలోని ఐయితా నగర్‌లోగల బాబు జగజీవన్ రామ్ కొత్త మాసు తులసిదాస్ కమ్యూనిటీ భవనంలో నిర్వహించిన అసోసియేషన్ మాస సమావేశానికి అసోసియేషన్ అధ్యక్షులు బిషప్ పాముల పరంజ్యోతి అధ్యక్షత వహించారు. అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బిషప్, డాక్టర్ పినపాటి జాన్ పాల్ లు అతిథులుగా హాజరయ్యారు. సభలో అసోసియేషన్ అధ్యక్షులు బిషప్ పాముల పరంజ్యోతి మాట్లాడుతూ నీ ముందు నడుచువాడు యెహోవా అనే వాక్యపదేశం తెలియజేశారు. పాస్టర్లు ఐక్యతతో నిబద్ధతతో ముందుకు సాగాలని సూచించారు. అసోసియేషన్ నియమ నిబంధనలకు అనుగుణంగా నడుచుకునే పాస్టర్లకు అసోసియేషన్ అండగా ఉంటుందన్నారు. బిషప్ డాక్టర్ పినపాటి జాన్ పాల్ మాట్లాడుతూ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ద్వారా అందరికీ సహాయ సహకారాలు అందించడం జరుగుతుందన్నారు. అవసరంలో ఉన్న దైవ సేవకులకు ఆర్థిక చేయూత సైతం అందజేసే విధంగా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. నిన్ను వలె నీ పొరుగు వారిని ప్రేమించుము అన్న సూక్తి ప్రకారం అసోసియేషన్ లోని ప్రతి సభ్యుడికి సహాయ సహకారాలు అందించే విధంగా కృషి చేస్తామన్నారు. పాస్టర్లకు దేవుని సువార్త అందించటమే ప్రధాన లక్ష్యంగా ఉండాలన్న అభిప్రాయాన్ని తెలియజేశారు. ఆ సభలో ఇరువురు పాస్టర్లకు 5,000 ఆర్థిక సహాయం అందించారు.సమావేశనిర్వాహకులు షాలెం రాజుకు 10,000 నగదును అందించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రెవరెండ్ సువర్ణరాజు, కార్యనిర్వాహక కార్యదర్శి రెవ. మల్లవరపు విజయ్‌కుమార్‌లు గత సమావేశపు జమ ఖర్చుల వివరాలను తెలియజేశారు.

# ఇంధనాన్ని అక్రమంగా నిల్వ చేస్తే కఠిన చర్యలు



**గుంటూరు పశ్చిమ రేపటి కోసం:** ఇంధనాన్ని అక్రమంగా నిల్వ చేసి బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. సోమవారం గుంటూరు నగరంలోని నగరంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని చుట్టుగుంట సెంటర్ వద్ద ఉన్న పెట్రోల్ బంకును, అదే విధంగా నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని హౌసింగ్ బోర్డు వద్ద ఉన్న పెట్రోల్ బంకులను క్షేత్ర స్థాయిలో పర్యటించి, ఆయా పెట్రోల్ బంకుల్లో పరిస్థితులను స్వయంగా పర్యవేక్షించి, వాహనదారులతో ఇంధనవనరుల లభ్యత గురించి జిల్లా ఎస్పీ ఆరా తీశారు. ఇంధనాల లభ్యత పుష్కలంగా ఉందని, వాహనదారులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎస్పీ తెలిపారు.

కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రస్తుతం రాష్ట్రంలో పెట్రోల్ డీజిల్ నిల్వలు పుష్కలంగా ఉన్నాయని ఎస్పీ తెలిపారు. రవాణా వ్యవస్థలో తలెత్తిన కొన్ని తాత్కాలిక సాంకేతిక కారణాల వల్ల సరఫరాలో స్వల్ప జాప్యం జరిగిందని, ఇది రెండు మూడు రోజుల్లోనే సాధారణ స్థితికి వస్తుందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే చమురు సంస్థల ప్రతినిధులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతోందని, అన్ని బంకులకు ఇంధనం సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. వదంతులను నమ్మి, భయాందోళనతో అవసరానికి మించి ఇంధనాన్ని కొనుగోలు చేసి ఇళ్ల వద్ద నిల్వ పెట్టుకోవడం ప్రమాదమని ఎస్పీ హెచ్చరించారు. ఈ వేసవిలో ఇళ్లలో ఇంధనాన్ని నిల్వ చేయడం వల్ల అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ప్రజలు ఇలా అనవసరంగా నిల్వలు చేయడం వల్ల, నిజంగా అవసరమైన వారికి ఇంధనం దొరకని పరిస్థితి ఏర్పడుతుంది. పోలీసులు రెవెన్యూ, సివిల్ సప్లైస్ శాఖలతో కలిసి ఇంధన నిల్వలు, సరఫరా పరిస్థితిని క్షేత్రస్థాయిలో నిశితంగా పరిశీలిస్తున్నామని తెలిపారు. జిల్లాలోని అన్ని పెట్రోల్ బంకుల వద్ద పోలీసు అధికారులు, సిబ్బంది నిరంతర పర్యవేక్షణ చేస్తున్నారని, రద్దీ ఎక్కువగా ఉన్న చోట ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక సిబ్బందిని కేటాయించామని ఎస్పీ పేర్కొన్నారు. ఇంధన కొరతపై అసత్య ప్రచారం చేసినా, వదంతులు వ్యాప్తి చేసినా, లేదా ఇంధనాన్ని అక్రమంగా నిల్వ చేసి బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడినా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎస్పీ నగరంపాలెం సీఐ సత్యనారాయణ, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు..

రేపటి కోసం
తెలుగు దినపత్రిక
www.Repatikosam.com



## పెట్రోల్ 'షాక్' లేదు.. 'స్టాక్' ఉంది..



**చిలకలూరిపేట (పల్నాడు జిల్లా) రేపటికోసం:** గత కొద్దిరోజులుగా సోషల్ మీడియా వేదికగా చిలకలూరిపేటలో ఇంధన కొరత ఏర్పడనుందనే వార్తలు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఈనేపథ్యంలో, సామాన్యుల ఆందోళనను గమనించిన చిలకలూరిపేట మున్సిపల్ కమిషనర్ పి. శ్రీహరిబాబు సోమవారం రంగంలోకిదిగారు. పట్టణంలోని పలు పెట్రోల్ బంకులను అకస్మికంగా తనిఖీ చేసి, క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితిని సమీక్షించారు. పట్టణంలో ఎక్కడా ఇంధన కొరత లేదని, అన్ని బంకుల్లో సరిపడా పెట్రోల్, డీజిల్ అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు వార్తలను చూసి ప్రజలు అనవసరంగా భయాందోళన చెందవద్దని కోరారు. వాట్సాప్, ఫేస్‌బుక్ వంటి వేదికల్లో వచ్చే ధృవీకరించని వార్తలను ఫార్వార్డ్ చేయవద్దు. అత్యవసరమైతే తప్ప పెద్ద ఎత్తున ఇంధనాన్ని నిల్వ చేసే ప్రయత్నం చేయకండి. అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారని గమనించండి. మున్సిపల్ యంత్రాంగం తీసుకున్న ఈ సత్వర చర్యతో పట్టణ ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఇంధన సరఫరా సజావుగా సాగుతుందని కమిషనర్ ఇచ్చిన భరోసాతో బంకుల వద్ద రద్దీ తగ్గే అవకాశం కనిపిస్తోంది.

## పెట్రోల్ బంకుల్లో రెవెన్యూ అధికారుల తనిఖీలు



**వినుకొండ ( పల్నాడు జిల్లా ) రేపటి కోసం :** పట్టణంలోని పలుపెట్రోల్ బంకుల్లో రెవెన్యూ అధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించారు.గత రెండు రోజులుగా డీజిల్, పెట్రోల్ కొరత తో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడడం, ప్రభుత్వం పెట్రోల్ బంకులపై పర్యవేక్షణ తప్పనిసరి చెప్పడంతో అధికారులు తనిఖీ నిర్వహించారు. స్టాకు వివరాలు, రికార్డులను పరిశీలించారు. ఉదయం నుండి రెవిన్యూ అధికారుల పర్యవేక్షణలో వాహనదారులకు పెట్రోలు, డీజిల్ సరఫరా చేయించారు. ఈ సందర్భంగా సురేష్ నాయక్ మాట్లాడుతూ పెట్రోల్ బంకు నిర్వాహకులు వాహనదారులకు సాధ్యమైనంత వరకు డీజిల్, పెట్రోల్ సరఫరా చేయాలన్నారు. అధిక ధరలకు విక్రయించిన, డ్రమ్ములకు నింపిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీలలో పట్టణ సీఐ ప్రభాకర్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అధికారుల రంగప్రవేశంతో వాహనదారులకు ఊరట



**పిడుగురాళ్ల (పల్నాడు జిల్లా)రేపటికోసం:** గత నాలుగు రోజులుగా పెట్రోల్ డీజిల్ కొరతతో నరకయాతన అనుభవించిన రైతులు వాహనదారులు ఎట్టకేలకు రెవిన్యూ అధికారుల రంగ ప్రవేశంతో ఊపిరి పీల్చుకున్నారు.ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం పిడుగురాళ్ల పరిధిలోగల పెట్రోల్ బంకులలో రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలో ఆయిల్ పంపిణీ సజావుగా సాగింది. వరి కోతలు జరుగుతున్న నేపథ్యంలో డీజిల్ కొరత లేకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు,బంకు యజమానులకు తగు సూచనలు చేస్తున్నట్లు తహసిల్దార్ మధు బాబు తెలిపారు. మాచవరం తహసిల్దార్ నాగమల్లేశ్వరరావు,పోలీస్ అధికారికలిసి మాచవరం మండలంలోని పిన్నెల్లిలో గల పెట్రోల్ బంకులను తనిఖీ చేశారు. పెట్రోల్ బంక్ నిర్వాహకులకు తగు సూచనలు జారీ చేశారు. దాచేపల్లి తాసిల్దార్ ఇచ్చిన సమాచారం ప్రకారం మండలంలో మొత్తం10 పెట్రోల్ బంకులు ఉన్నట్లు తెలిపారు. గామాలపాడులోని లహరి బంకులో డీజిల్ అయిపోయినట్లు సాయంత్రానికి స్టాక్ రానున్నట్లు తెలిపారు. జెకె ఫీలింగ్ స్టేషన్ నందు పెట్రోలు 4000 లీటర్లు ఉన్నట్లు, డీజిల్ లేదన్నారు. తంగెడలో నరసింహ కిసాన్ సేవా బంకులో డీజిల్ లేదు పెట్రోల్ ఉన్నది. మిగతా అన్నిచోట్ల డీజిల్ పెట్రోల్ స్టాక్ ఉన్నట్లు, వాహనదారులు ఎటువంటి ఇబ్బంది పడనవసరం లేదన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

## రెవెన్యూ సిబ్బంది పర్యవేక్షణలో ఆయిల్ సరఫరా

**గురజాల(పల్నాడుజిల్లా),రేపటికోసం:** గురజాల మండలంలో ప్రస్తుతం నెలకొన్న ఆయిల్ కొరత పరిస్థితుల నేపథ్యంలో రెవెన్యూ సిబ్బంది పర్యవేక్షణలో పెట్రోలు బంకులవద్ద ఆయిల్ సరఫరా చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు గురజాల తహసిల్దారు ఎన్ దుర్గేశ్వరరావు సోమవారం తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో ఉన్న నాలుగు పెట్రోలు బంకులవద్ద డీజిల్, పెట్రోల్ సరఫరా సక్రమంగా జరిగేలా చూసేందుకు స్థానిక విఆర్‌ఓలు జ్యోతి, ప్రసాదరావు, కె శ్రీనివాసరావు, ప్రభుకుమార్‌లను ప్రత్యేకంగా నియమించినట్లు తెలిపారు. అదేవిధంగా అన్ని పెట్రోలు బంకులవద్ద పౌరసరఫరాల డిప్యూటీ తహసిల్దారు ఆయిల్ పంపిణీ వ్యవహారాన్ని పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. వినియోగదారులు ఆయిల్ కోసం ఆందోళన చెందవలసిన అవసరం లేదని, పెట్రోలు బంకులవద్ద ఎటువంటి వాగ్వివాదాలకు దిగకుండా అధికారులకు సహకరించవలసిందిగా కోరారు. పెట్రోలు బంకు నిర్వాహకులు కూడా పెట్రోల్, డీజిల్‌ను అక్రమంగా నిల్వఉంచి, బ్లాక్‌మార్కెట్లో అధికధరలకు విక్రయిస్తే లైసెన్స్ సీజ్ చేయటంతోపాటు కఠినచర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## చిరుమామిళ్లలో పోలీసుల కార్డెన్ సెర్చ్



**నాదెండ్ల (పల్నాడు జిల్లా) రేపటికోసం:** మండలంలోని చిరుమామిళ్ల గ్రామంలో పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు, నాదెండ్ల మండలం చిరుమామిళ్ల గ్రామంలో పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా గ్రామంలో చేపట్టిన ఈ 'కార్డెన్ సెర్చ్' తనిఖీలు స్థానికంగా కలకలం రేపింది. ట్రైనీ డీఎస్పీ జై నిరంజన్ నేతృత్వంలో పోలీసులు ప్రతి ఇంటిని, వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.ఈ తనిఖీల్లో భాగంగా సరైన ధ్రువీకరణ పత్రాలులేని 24 మోటార్ సైకిళ్ల, ఒక ఆటోను పోలీసులు సీజ్ చేశారు. వీటితో పాటు అక్రమంగా నిల్వ ఉంచిన మూడు కత్తులను మారణా యుధాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ గ్రామంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహిం చేది లేదని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అపరిచిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని గ్రామస్తులకు సూచించారు.

## నేడు బాలుర బాల్‌బ్యాడ్మింటన్ సమ్మర్ క్యాంప్ ప్రారంభం

**వినుకొండ టౌన్ (పల్నాడు జిల్లా) రేపటి కోసం:** నిర్మల ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ ప్రాంగణంలో బాలుర బాల్ బ్యాడ్మింటన్ రెసిడెన్షియల్ సమ్మర్ క్యాంపు ఈనెల 28వ తేదీన ప్రారంభిస్తామని ఉమ్మడి గుంటూరు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ బి జోన నాయక్ తెలిపారు. క్యాంపు నిర్వహణకు సంబంధించిన క్రీడా ప్రాంగణాన్ని సిస్టర్ సిసిలీ, సిస్టర్ రాణి, సిస్టర్ సెలీన్, త్రిపురాపురం డి సి చైర్మన్ గంగినేని రాఘవ రావు, ఎన్ ఎస్ పి జడ్పీ హైస్కూల్ పిడి రాగుల రాధాకృష్ణమూర్తి, పి ఈ టి శ్రీనివాసరావు, గణప వీరాంజనేయులు, పాపారావులు పరిశీలించారు. జోన నాయక్ మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు శివశంకర్, సెక్రటరీ శ్రీనివాసరావుల పర్యవేక్షణలో సమ్మర్ క్యాంపు మే 12 వరకు జరుగుతుందన్నారు.

## విత్తన గుళికల విధానంతో వేసవిలో పంటలు సాధ్యం

**పల్నాడు జిల్లా బ్యూరో, రేపటి కోసం:** విత్తన గుళికలు (సీడ్ బాల్స్) తయారు చేసి విత్తడం ద్వారా వేసవి కాలంలో కూడా పంటలను విజయవంతంగా పండించవచ్చని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె. అమల కుమారి తెలిపారు. పల్నాడు జిల్లాలోని నాదెండ్ల మండలం చిరుమామిళ్ల గ్రామ రైతు భవనం శ్రీనివాసరెడ్డి పొలంలో సోమవారం జాతీయ మిషన్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ, ఉద్యానవన, ప్రకృతి వ్యవసాయం శాఖల సిబ్బందికి రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ శిక్షణకు ముఖ్య అతిథిగా హాజరైన అమలా కుమారి మాట్లాడుతూ, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అమలవుతున్న ఈ పథకం కింద నాదెండ్ల మండలంలో ఐదు గ్రామాలను ప్రకృతి వ్యవసాయ గ్రామాలుగా ఎంపిక చేసినట్లు తెలిపారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా భూమిలో కార్బన్ శాతం పెరిగి, నీటి నిల్వ సామర్థ్యం మెరుగుపడుతుందన్నారు. పీఎండీఎస్ వినియోగం ద్వారా పంటలకు చీడపీడలు, ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునే శక్తి పెరుగుతుందని, అవసరమైన పోషకాలు సమృద్ధిగా అందుతాయని పేర్కొన్నారు. ఉపకరణాలు తయారు చేసుకోలేని రైతుల కోసం గ్రామాల్లో బయో రిసోర్స్ సెంటర్లు ఏర్పాటు చేసి, ఘనజీవామృతం, నీమాస్త్రం, అగ్నిస్త్రం, దశపర్ణి కషాయం వంటి ఇన్-పుట్స్ అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు.ప్రతి రైతు తన భూమిలో కనీసం కొంత భాగంలోనైనా ప్రకృతి వ్యవసాయం చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎమ్‌టి సాగి శ్రీనివాసరావు, రైతు శ్రీనివాసరెడ్డి, రైతులు, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

## డీజిల్ కొరత పేరుతో అధికంగా కొనుగోలు చేయొద్దు



- క్షేత్రస్థాయిలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు
- ప్రజలకు జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా విజ్ఞప్తి

**పల్నాడు జిల్లా బ్యూరో, రేపటి కోసం:** సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దని జిల్లా కలెక్టర్ కృత్తిక శుక్లా విజ్ఞప్తి చేశారు. జిల్లా ప్రజల అవసరాల మేర డీజిల్ నిల్వలు ఉన్నాయని తెలిపారు. అవసరాలకు అనుగుణంగా మాత్రమే డీజిల్ కొనుగోలు చేయాలని కోరారు. నకరికల్లు గ్రామంలోని పెట్రోల్ బంకును జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వినియోగదారులతో మాట్లాడారు. అధికారులు, ఆయిల్ కంపెనీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా టెలికాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. జిల్లాలో డీజిల్ సమస్యపై అధికారులు సమర్థవంతంగా స్పందించాలన్నారు. ఏ బంక్ లోను డీజిల్ కొరత లేకుండా చూడాలి. జిల్లాలోని ప్రతి బంక్ వద్ద స్పెషల్ ఆఫీసర్స్ ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. ప్రతి బంకులో డీజిల్ నిల్వలు అయిపోకుండా ఒకరోజు ముందుగానే గుర్తించి ట్యాంకర్లను బుక్ చేయాలి. రబీ ధాన్యం తరలించే వాహనాలు, ఆక్వా రైతులకు డీజిల్ కొరత లేకుండా ప్రాధాన్యత ఇస్తున్నాం. జిల్లాలో డీజిల్ డిమాండ్, సరఫరాను పర్యవేక్షించేందుకు కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశాం. వినియోగదారులు సమస్య ఉన్న పక్షంలో కంట్రోల్ రూమ్ నెం.08647 252999కు కాల్ చేయాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా తెలిపారు. పెట్రోల్ ధరలు పెరుగుతాయనే ప్రచారాన్నీ నమ్మొద్దు. అవసరం లేకున్నా పెట్రోల్ కొనుగోలు చేస్తున్నారు. ఒకేసారి వాహనాలకు ఫుల్ ట్యాంక్‌లు చేయించడం వల్ల పెట్రోల్ బంకు నిర్వాహకులు నోస్టాక్ బోర్డు పెడుతున్నారు. పెట్రోల్, డీజిల్ సరఫరా రెగ్యులర్ కన్నా 20 శాతం అదనంగా సరఫరా చేస్తున్నారు. సీఎం, పౌరసరఫరాల శాఖ మంత్రి మానిటరింగ్ చేశారు. వాహనదారులు ఆందోళన చెందాల్సిన అవసరంలేదని పెట్రోల్,డీజిల్ నిల్వలు సరిపోయే విధంగా ఉన్నాయని జిల్లా కలెక్టర్ తెలిపారు.

## ఘనంగా వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు జయంతి



**పల్నాడు జిల్లా బ్యూరో, రేపటి కోసం:** అమరావతి రాజు వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు 266వ జయంతి వేడుకలు పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట కలెక్టరేట్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్, రెవెన్యూ అధికారి సమక్షంలో అధికారులందరూ పాల్గొని మహానుభావుని చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి రాజా వాసిరెడ్డి వంశానికి చెందిన 6వ తరం వారసుడు అమరావతి సంస్థానం ఫౌండర్ ట్రస్టీ రాజా వాసిరెడ్డి సుధా స్వరూప్ మన్నే సుల్తాన్ బహదూర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 266వ జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తింపునకు కృషి చేసిన అఖిల భారత పంచాయతీ పరిషత్ (న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు, అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు కూడా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రాజావారి చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రముఖులు మాట్లాడుతూ వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు సేవలను స్మరించుకున్నారు. ఆయన ప్రజాహిత పాలన, ధార్మికత, అభివృద్ధి దృక్పథం నేటి తరాలకు మార్గదర్శకమని కొనియాడారు. చరిత్రలో చిరస్థాయి స్థానం పొందిన అమరావతి రాజు వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు (27 ఏప్రిల్ 1761- 17 ఆగస్టు 1817) ఆంధ్రదేశ చరిత్రలో అపూర్వమైన జమీందారు, పరిపాలన దక్షుడు. గుంటూరు, కృష్ణా ప్రాంతాలను పరిపాలిస్తూ శాంతి భద్రతలను నెలకొల్పి ప్రజల విశ్వాసాన్ని గెలుచుకున్నారు. ఆయన పాలనలో వ్యవసాయం విస్తృతంగా అభివృద్ధి చెందింది. అమరావతిని రాజకీయ, సాంస్కృతిక కేంద్రంగా తీర్చిదిద్దిన మహానుభావుడిగా ఆయన పేరు చిరస్థాయిగా నిలిచింది. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి నారదముని, జిల్లా వైద్యాధికారి రవి, జిల్లా పర్యాటక శాఖాధికారి నాయుడమ్మ, డిప్యూటీ డైరెక్టర్ ఐ&పిఆర్ దీప్తి, పుడా అధికారి వెంకటకృష్ణ, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## గోమాతను జాతీయ జంతువుగా ప్రకటించాలి



**అమరావతి పల్నాడు జిల్లా రేపటి కోసం:** పల్నాడు జిల్లా అమరావతి అంటూ భారతదేశ వ్యాప్తంగా ఈ రోజు ప్రతి తహసీల్దార్ కార్యాలయం లో మెమోరాండమును అందించడం జరిగింది. ఇందులో భాగంగా అమరావతి గోసంరక్షణ సమితి సభ్యులందరూ స్థానిక ఎమ్మార్వో శ్రీ డానియల్ కలిసి వినతి పత్రాలను అందించారు. వేల ఏళ్లుగా భారతదేశం వ్యవసాయ ఆధారిత దేశమని వ్యవసాయానికి గోసంపద వెన్నెముక లాంటిదని అటువంటి గోసంతతిని రక్షించుకోవాలని గో సంరక్షణ సమితి సభ్యులు తెలియజేశారు. గోఆధారిత వ్యవసాయం ప్రకృతికి ఎంతో మేలు చేయడంతో పాటు మానవుల ఆరోగ్యాన్ని కూడా కాపాడుతుందని ఎన్నో పరిశోధనలు తెలియజేశారని అన్నారు. కాబట్టి తగ్గిపోతున్న గో సంతతిని రక్షించాలని ఇందుకు గోవును జాతీయ జంతువుగా ప్రకటించడం ఒకటే మార్గమని అన్నారు. కార్యక్రమంలో కోలా వెంకటేశ్వరరావు, పులిపాటి వెంకట పవన్ కుమార్, మద్ది ధాత్రి నారాయణ, నేరెళ్ల హనుమంతరావు, అప్పికట్ల శ్రీనివాసరావు, పసుపులేటి రామనాథ్, గోగినేని వెంకటరమణ, గాజుల నరేంద్ర, రాయి సత్యనారాయణ,ఎన్ నరసింహారావు, చక్రవర్తి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ స్వీయ జనగణన నమోదు చేసుకోవాలి

**నరసరావుపేట టౌన్, (పల్నాడు జిల్లా), రేపటి కోసం:** స్వీయ జనగణన-2027 లో ప్రతి ఒక్కరు డిజిటల్ ఫార్మేట్లో నమోదు చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. సోమవారం స్థానిక గుంటూరు రోడ్డులోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. 15 ఏళ్ల విరామం తర్వాత దేశవ్యాప్తంగా జరుగుతున్న 16వ జనగణన-2027 తెరలేచిందన్నారు. రెండు దశల్లో జరిగే ఈ మహా గణనలో తొలి దశ ఇంటి జాబితా, గృహ గణన ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు కొనసాగనుంది. రెండో దశ జనాభా గణన 2027 ఫిబ్రవరిలో చేపడతారు. ఈసారి పూర్తిగా డిజిటల్ విధానంలో స్వీయ గణన అవకాశంతో జనగణన జరుగుతుందని తెలిపారు. ఈ జనగణనకు డీలిమిటేషన్ బిల్లు, మహిళా రిజర్వేషన్ బిల్లుకు సంబంధం ఉందన్నారు. ఈ రెండు బిల్లులు పాస్ కావాలంటే జనగణన అనివార్యమని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో తొలిదశ ఏప్రిల్ 16న ప్రారంభమైందని, ఏప్రిల్ 16-30 వరకు se.census.gov.in పోర్టల్‌ద్వారా స్వీయగణనకు అవకాశం కల్పించార న్నారు. మే 1 - 30 వరకు ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి వివరాలు నమోదు చేస్తారని చెప్పారు.

## 29న మెగా జాబ్ మేళా




**నరసరావుపేట మున్సిపాలిటీ, (పల్నాడు జిల్లా), రేపటి కోసం :** నరసరావుపేటలోని ఎస్ ఎస్ ఏ ఎన్ కళాశాలలో ఈనెల 29వ తేదీ బుధవారం మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే అరవిందబాబు వివరాలు వెల్లడించారు. ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగే ఈ జాబ్ మేళా ఉ. 9 గం. లకు ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, ఆర్డీవో, డీఆర్వో, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులతో పాటు రాజకీయ నాయకులు హాజరుకానున్నారు. ఈ మెగా జాబ్ మేళాకు 30కి పైగా బహుళజాతి ప్రముఖ సంస్థలు హాజరుకానున్నాయని అన్నారు. ఈ కంపెనీల్లో 2000కి పైగా ఉద్యోగ ఖాళీలు ఉన్నాయని తెలిపారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, ఫార్మసీ, పీజీ వరకు చదివిన అభ్యర్థులు ఈ జాబ్ మేళాలో పాల్గొనవచ్చు. వయోపరిమితి 18 నుంచి 35 ఏళ్లలోపు ఉండాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.15,000 - 1,50,000 వరకు వేతనం లభించే అవకాశం ఉందని ఎమ్మెల్యే తెలిపారు. ఫోర్త్ క్లాస్ ఉద్యోగాల నుంచి సాఫ్ట్‌వేర్, గ్రూప్-1 స్థాయి పోస్టుల వరకు అవకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. గతంలో మేదరమెట్ల ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళాలో సుమారు 600 మంది అభ్యర్థులు ఎంపికై ప్రస్తుతం ఉద్యోగాలు చేస్తున్నారని, వారు రూ.15,000 నుంచి రూ.30,000 వరకు వేతనం పొందుతున్నారని ఎమ్మెల్యే అరవిందబాబు గుర్తుచేశారు. పదో తరగతి పాసైన వారికి కూడా అవుట్ సోర్సింగ్ ద్వారా స్థానికంగా ఉద్యోగాలు కల్పిస్తామని తెలిపారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి



**పల్నాడు జిల్లా బ్యూరో, రేపటి కోసం:** పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట కలెక్టరేట్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ ఎస్) నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ఆయా మండలాల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన ప్రజల నుండి జిల్లా రెవిన్యూ అధికారి నారదముని అర్జీలను స్వీకరించారు. ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ వేదిక ద్వారా ప్రజల నుంచి 232 అర్జీలను స్వీకరించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా రెవిన్యూ అధికారి నారదముని మాట్లాడుతూ వచ్చిన అర్జీల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి పెట్టి పనిచేయాలని ఆయా శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లా అధికారులు అర్జీలను సకాలంలో పరిష్కరించాలని, ఆయా శాఖల పరిధిలో పిజిఆర్ఎస్ గ్రీవెన్స్ పై ఆడిట్ నిర్వహించాలన్నారు. అర్జీదారులతో మాట్లాడాలని, పెండింగ్ ఆడిట్ పూర్తి చేయాలన్నారు. జిల్లా అధికారులు వారి పరిధిలో ఎలాంటి పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు అర్జీలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

## ఆధ్యాత్మిక మహోత్సవానికి అన్నవరం సిద్ధం

**రొంపిచర్ల, (పల్నాడు జిల్లా), రేపటి కోసం :** రొంపిచర్ల మండలం, అన్నవరం గ్రామంలో ఈ నెల 29 నుంచి మే 1 వరకు అద్దంకమ్మ అమ్మ వారి, గ్రామ నాభిశిల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవ వేడుకలు జరగనున్నాయి. శ్రీ భవానీ శంకర స్వామి సపరివార దేవత విగ్రహం, గణపతి, 26 అడుగుల ఆంజనేయ స్వామి ఏకశిలా విగ్రహం, నందీశ్వర, నవగ్రహ, సుబ్రహ్మణ్య సమేతంగా శ్రీ భవానీ శంకర స్వామి సపరివార దేవతల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. బుధవారం నుండి 3 రోజుల పాటు జరగనున్న కార్యక్రమంలో ప్రాణ ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లుచేశారు. మహోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమాలు ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం భక్తులకు భారీ అన్నదానం నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గ్రామస్తులు కోరారు.

## జాతీయ ఉపాధి హామీ పథకాన్ని నీరుగారుస్తున్నారు



- డా॥ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

**నరసరావుపేట మున్సిపాలిటీ, (పల్నాడు జిల్లా), రేపటి కోసం :** కొత్త పలుకు పేరుతో రాధాకృష్ణ చేసిన నీచమైన వ్యాఖ్యలపై కేసులు నమోదు చేయాలని వైకాపా నేతలు సోమవారం విజ్ఞప్తి చేశారు. వైసీపీ జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, పెదకూరపాడు పార్టీ సమన్వయకర్త నంబూరి శంకర్రావు, సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి, జిల్లా పార్టీ నేతలు ఎస్పీ కృష్ణారావును కలిసి ఏబీఎన్ రాధాకృష్ణపై తక్షణమే కేసు నమోదు చేయాల్సిందిగా కోరారు. అదేవిధంగా పల్నాడు జిల్లా కలెక్టర్‌ను కలిసి ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గత ఐదు నెలలుగా పల్నాడు జిల్లాలో జాతీయ గ్రామీణ ఉపాధి పథకానికి సంబంధించిన వేతనాలు కూలీలకు ఇవ్వడం లేదన్నారు. రూ.234 కోట్ల ఎన్ఆర్‌జిఎస్ బకాయిలు ఉన్నాయని, ఈ ప్రభుత్వానికి రాజధాని, వారి మంత్రులు, కుటుంబ సభ్యుల దోపిడి తప్ప ఏమి పట్టటం లేదన్నారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధరలు లేవని, కూలీల వలసలను ఆపడానికి ఏర్పాటుచేసిన జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో కూలీలకు వేతనాలు కూడా చెల్లించలేని స్థితిలో ఈ ప్రభుత్వం ఉందని విమర్శించారు. ఇద్దరు ఉపాధి హామీ కూలీలు జిల్లాలో ప్రాణాలు పోగొట్టుకున్న సంఘటనలు సైతం ఉన్నాయని గుర్తు చేశారు. నకిలీ జాబ్ కార్డులు తయారుచేసి ఈ నిధులను కొల్లగొడుతూ ఎన్ఆర్జిఎస్ పథకాన్ని అవినీతిమయం చేశారన్నారు. టీడీపీకి చెందిన వ్యక్తులు బరంపేటలో తిరుపతమ్మ గుడి దగ్గర సుమారు రూ. 1.05 లక్షలు విలువచేసే 8 సెంట్లు ఖాళీ స్థలాన్ని కబ్జా చేశారన్నారు. కబ్జా చేసిన స్థలంలో షెడ్లు నిర్మించారని స్థానికులు ఫిర్యాదు చేస్తే వారిపై దాడి చేయించాడన్నారు. తక్షణమే కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కలెక్టర్ కి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో వైసీపీకి చెందిన పలువురు రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## నేడు వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభం

**శావల్యాపురం (పల్నాడు జిల్లా) రేపటి కోసం:** మండల కేంద్రమైన శావల్యాపురంలోని శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరం ఈనెల 28వ తేదీన ప్రారంభిస్తామని గ్రంథాలయ అధికారి రావూరి శ్రీనివాసరావు తెలిపారు. జూన్ నెల 6వ తేదీ వరకు వేసవి విజ్ఞాన శిబిరం కొనసాగుతుందన్నారు. ప్రతిరోజు ఉ. 8 గం.ల నుండి 11 గం.ల వరకు విద్యార్థులకు కథలు చెప్పడం, కథలు చదివించడం, డ్రాయింగ్, క్యారమ్స్, చదరంగం వంటి ఆటలు ఆడించడం చేస్తామన్నారు. వేసవిజ్ఞాన శిబిరంలో విద్యార్థులంతా పాల్గొనవలసిందిగా శాఖ గ్రంథాలయ అధికారి శ్రీనివాసరావు కోరారు.

## పిడిఓ, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లకి శిక్షణ



**వినుకొండ టౌన్ (పల్నాడు జిల్లా) రేపటి కోసం:** మండలంలోని గ్రామాలలో కమ్యూనిటీ శానిటేషన్ కాంప్లెక్స్‌ల నిర్వహణకి సంబంధించి పంచాయతీ అభివృద్ధి అధికారి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ లకి ఒకరోజు మండల స్థాయి శిక్షణ కార్యక్రమాలు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ సహకారంతో శిక్షణ తరగతులు జరిగాయి. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపీడీవో జి సుందర్‌రెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో స్వర్ణ గ్రామం జి బాల కోటేశ్వరరావు, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ సిహెచ్‌వి రవి, మండల రిసోర్స్ కోఆర్డినేటర్ ప్రభాకర్ రావు, పంచాయతీ అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా రాజా వాసిరెడ్డి నాయుడు జన్మదిన వేడుకలు



**అమరావతి పల్నాడు జిల్లా రేపటి కోసం:** పవిత్ర పుణ్యక్షేత్రమైన అమరావతిలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు జన్మదినోత్సవాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించటం ఎంతో శుభ పరిణామమని అమరావతి గ్రామ వాసులందరూ హర్షాన్ని వ్యక్తం చేశారు. దీనితో అమరావతి ఘన చరిత్రకు మంచి గుర్తింపు లభిస్తుందని అన్నారు. స్థానిక నాయకులు జిల్లా పర్యాటక మండల సభ్యులు కోలా వెంకటేశ్వరరావు, పులిపాటి వెంకట పవన్ కుమార్, నేరెళ్ల హనుమంతరావు, మద్ది దాత్రి నారాయణ, అప్పికట్ల శ్రీనివాసరావు, పసుపులేటి రామనాథ్, నరసింహారావు, గాజుల నరేంద్ర గోగినేని వెంకటరమణ, జనసేన నాయకులు రాయి సత్యనారాయణ పాల్గొన్నారు.

## చిరుసత్కారం



**అమరావతి పల్నాడు జిల్లా రేపటి కోసం:** పల్నాడు జిల్లా అమరావతి మెయిన్ రోడ్‌లోగల కోదండ రామాలయంలో 41 రోజులు హనుమాన్ చాలీసా పారాయణం సందర్భంగా ఆర్య వైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు పొరేపల్లి పుష్పలత కమిటీ వారికి మండలి సెక్రెటరీ మద్ది దివ్య ట్రెజరర్ రాజేశ్వరి జాయింట్ సెక్రెటరీ వి భారతీదేవిని కోదండ రామాలయంలో చిరు సన్మానం నిర్వహించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్య వైశ్య మహిళా మండలి సభ్యులకు అందరికీ ధన్యవాదాలు తెలుపుకుంటూ ఇలాగే ప్రతి కార్యక్రమం కలిసి చేసుకోవాలని అధ్యక్షురాలు పొరేపల్లి పుష్పలత మాట్లాడటం జరిగింది. అలానే ప్రతి కార్యక్రమానికి అందరూ నాకు సహకరించి ఇలాంటి పూజలు ఎన్నో చేయాలని ఆమె అన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## నోటీసులు వెనక్కి తీసుకోవాలంటూ ధర్నా

**పిడుగురాళ్ల(పల్నాడుజిల్లా)రేపటికోసం :** మున్సిపల్ కార్మికులకు అక్రమంగా ఇచ్చిన నోటీసులను వెంటనే వెనక్కి తీసుకోవాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో పిడుగురాళ్ల మున్సిపల్ ఆఫీస్ ఎదుట మున్సిపల్ కార్మికుల ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి తెలకపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులకు మార్చినెల, ఏప్రిల్ నెల చివరి వరకు పెండింగ్ వేతనాలు చెల్లించకపోవడంతో పలుమార్లు యూనియన్ రాష్ట్ర నాయకులు, అధికారులకు విన్నవించినప్పటికీ కార్మికులకు వేతనాలు వేయని పరిస్థితి.ఈ క్రమంలో ఏప్రిల్ 21వ తేదీ రాష్ట్రవ్యాప్తంగా కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో మెరుపు సమ్మె నిర్వహించారు. అనంతరం ప్రభుత్వం దిగివచ్చి అదరోజు మ. 3 గం.లకు కార్మికుల అకౌంట్లో వేతనాలు వేసింది. ఈ సందర్భంగా పిడుగురాళ్లలో రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సమ్మె నిర్వహించినందుకు మున్సిపల్ కమిషనర్ మున్సిపల్ కార్మికులకు నోటీసులు ఇచ్చారని, జీతం అడిగినందుకు కార్మికులకు నోటీస్ ఇవ్వడం సిగ్గుచేటని, కార్మికులకు నెల నెల వేతనాలు ఇవ్వాలని, సమ్మె కాలపు వేతనాల వెంటనే విడుదల చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ డి. రాముడుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ పారిశుద్ధ కార్మికులు సమ్మె కుంభ కొండలు,అంగిడి రామారావు, బత్తుల రామారావు, అంగిడి శీను కంపాటి సుజాత, దేవరకొండ లక్ష్మి ,అంకాల అరుణ, సంసోను, యలమంద, పాలకుర్తి సురేంద్ర,బత్తుల అనిల్, అంగిడి ఆంజనేయులు, కోడి రెక్క మేరమ్మ,బత్తుల అనిల్ పాల్గొన్నారు.

## వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

**ఈపూరు (పల్నాడు జిల్లా) రేపటి కోసం:** విద్యార్థులు వేసవి విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈపూరు శాఖ గ్రంథాలయ అధికారి గంటా శ్రీనివాసరావు అన్నారు. స్థానిక గ్రంథాలయ ఆవరణలో రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు 266వ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా జరిపారు. సందర్భంగా వెంకటాద్రి నాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వెంకటాద్రి నాయుడు ప్రజలకు అందించిన సేవలను గురించి కొనియాడారు. ఏప్రిల్ 28 నుండి జూన్ 6 వరకు ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు ప్రత్యేక విజ్ఞాన శిబిరాన్ని స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్నా మన్నారు. విద్యార్థులకు ప్రతిభ, సృజనాత్మకత మరియు శారీరక మానసిక వికాసానికి ఉపయోగపడే కార్యక్రమాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. తెలుగు శతక పద్యాలు, ఇంగ్లీష్ భాషల్లో మాట్లాడే, వ్రాసే నైపుణ్యం మెరుగుపరుచుకోవాలని విద్యార్థులకు సూచించారు.

## ఏసీబీ వలకు చిక్కిన బాపట్ల మునిసిపల్ ఆర్ఐ ఇమామ్

**రూ 60 వేలు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా అరెస్ట్**

**సూర్యలంక మార్గములో టీస్టాల్ వద్ద దాడి చేసిన అధికారులు**

**అదుపులోకి తీసుకున్న ఏసీబీ డీఎస్పీ ప్రతాప్ బృందం**



**బాపట్ల, రేపటి కోసం:** బాపట్ల పురపాలక సంఘంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న షేక్ ఇమామ్ లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. సోమవారం సూర్యలంక మార్గంలో ఒక టీస్టాల్ వద్ద బాధితుడి నుండి నగదు తీసుకుంటుండగా అధికారులు ఆకస్మిక దాడి చేసి ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఏసీబీ డీఎస్పీ ప్రతాప్ తెలిపిన వివరాల ప్రకారం బాపట్ల మునిసిపాలిటీలో ఆర్ఐగా విధులు నిర్వహిస్తున్న షేక్ ఇమామ్, ఒక పని నిమిత్తం బాధితుడిని లంచం డిమాండ్ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు వ్యూహం రచించిన ఏసీబీ అధికారులు, సోమవారం సూర్యలంక మార్గంలో పక్కా ప్రణాళికతో మాటు వేశారు. ఆర్ఐ ఇమామ్ బాధితుడి నుండి రూ 60 వేలు లంచం తీసుకుంటుండగా, ఏసీబీ అధికారులు ఒక్కసారిగా దాడి చేసి నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆయన చేతులకు రసాయన పరీక్షలు నిర్వహించి, లంచం తీసుకున్నట్లు నిర్ధారించారు. ప్రస్తుతం ఆర్ఐని అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు, ఆయన నివాసం, కార్యాలయంలో సోదాలు నిర్వహిస్తున్నారు. ఈ కేసుపై పూర్తిస్థాయి విచారణ జరిపి తదుపరి చర్యలు తీసుకుంటామని డీఎస్పీ ప్రతాప్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ ప్రతాప్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే వెనుకాడకుండా ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## పారిశుధ్యం, పరిశుభ్రతలో శానిటేషన్ సిబ్బంది కీలక పాత్ర

**మున్సిపల్ కమిషనర్ జి. రఘునాథ రెడ్డి**




**బాపట్ల టౌన్, రేపటి కోసం:** మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథ రెడ్డి తెల్లవారు జాము నుండి బాపట్ల పుర పాలక సంఘ పరిధిలో విస్తృతంగా పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా 10వ సచివాలయం పరిధిలోని రాజ్యలక్ష్మి నగర్ ప్రాంతంలో జరుగుతున్న ప్రధాన డ్రెయిన్ డీసిల్టింగ్ పనులను కమిషనర్ పరిశీలించారు. పనుల నాణ్యత, వేగం మరియు నిర్వహణపై సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు ఇచ్చారు.అనంతరం 19 వ వార్డు మార్కెట్ ప్రాంతంలో పారిశుధ్య పనులను పరిశీలించి,కార్మికులతో స్వయంగా మాట్లాడి వార్డు వారీగా ప్రతిరోజూ నిర్వహిస్తున్న పనుల గురించి వివరాలు తెలుసుకున్నారు.పట్టణాన్ని శుభ్రంగా ఉంచడంలో శానిటేషన్ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని, తమ బాధ్యతలను క్రమంగా నిర్వర్తించాలని సూచించారు. అనంతరం అన్నా క్యాంటీన్‌ను సందర్శించిన మున్సిపల్ కమిషనర్ , అక్కడి భోజన నాణ్యతను పరిశీలించి ప్రజలతో మాట్లాడి ఆహారం రుచి, అందిస్తున్న సౌకర్యాలపై అభిప్రాయాలను తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందేలా అన్ని ఏర్పాట్లు ఉండాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రణాళిక అధికారి యస్.మల్లిఖార్జున రావు, ఎస్ జి ఎస్ డబ్ల్యు మేనేజర్ కె.రాధ అధికారులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు సత్వరం కృషి చేయాలి



**పర్చూరు (బాపట్ల జిల్లా) రేపటి కోసం:** ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు సత్వరం కృషి చేయాలని జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వము ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిస్కార వేదిక(పి.జి.ఆర్.ఎస్) కార్యక్రమం సోమవారం ఉదయం పర్చూరు నియోజకవర్గం, మండల కేంద్రం పర్చూరులోని కొల్లా వారి కళ్యాణ మండపం నందు నిర్వహించారు. పి జి ఆర్ ఎస్ కార్యక్రమానికి పర్చూరు, రెవిన్యూ రెవిన్యూ డివిజన్ పరిధిలోని మండలాల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారులు చెప్పే సమస్యలను వింటూ వారి నుంచి అర్జీలను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్, డిప్యూటీ కలెక్టర్ లవన్న అర్జీలను స్వీకరించారు . ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ శాఖల అధికారులందరూ సమన్వయంతో పనిచేసి పీజీఆర్ఎస్లో వచ్చిన అర్జీలను పెండింగ్ పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు.ఈ కార్యక్రమంలో డి యం అండ్ హెచ్ ఓ.డాక్టర్ ఎస్.విజయమ్మ పిడి లు, డ్వామా,డిఆర్డీఏ,మెప్మా, ఐసిడి ఎస్, గృహ నిర్మాణ సంస్థ,విజయలక్ష్మి,సింగయ్య, పాల్, రాధమాదవి,వెంకటేశ్వర రావు, మార్క్ పేడ్ డి యం.కరుణశ్రీ, డిసిహెచ్ ఎస్.పద్మావతి, డిటిసి. పరందామ రెడ్డి,జి యం.డి ఐ సి.రామకృష్ణ,డి ఎస్ ఓ.ఆర్.నజీర్ బాషా, జిల్లా వ్యవసాయ అధికారిణి విజయనిర్మల, డిపి ఓ.యల్.ప్రభాకర్‌రావ్, డి ఈఓ.శ్రీనివాస్, బి.సి. మరియు గిరిజన సంక్షేమ శాఖల అధికారులు నాగేశ్వరావు, అబ్బులు, యల్ డి యం,శివ కృష్ణ, వివిధ శాఖల జిల్లా అధికారులు మరియు డివిజన్ స్థాయి, మండల స్థాయి అధికారులు, తహశీల్దార్లు, యంపిడిఓ లు, అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ పీజీఆర్ఎస్‌కు 38 అర్జీలు

**చీరాలలో పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించిన జిల్లా ఎస్పీ**



**చీరాల (బాపట్ల జిల్లా), రేపటి కోసం:** చీరాల ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో బాపట్ల జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చీరాల సబ్ డివిజన్, పరిసర ప్రాంతాల నుండి వచ్చిన 38 మంది అర్జీదారులు తమ సమస్యలను జిల్లా ఎస్పీకి స్వయంగా విన్నవించుకున్నారు. వారి సమస్యలను క్షుణ్ణంగా విని, అర్జీలను పరిశీలించిన ఎస్పీ చట్ట పరిధిలో విచారించి నిర్ణీత గడువులోగా పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ప్రజలకు మరింత చేరువగా చేసేందుకు చీరాల సబ్ డివిజన్ పరిధిలో నిర్వహించడం జరిగిందన్నారు. రాబోయే రోజులలో ప్రతివారం జిల్లాలోని ఒక్కొక్క నియోజకవర్గంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆ నియోజకవర్గ ప్రజల చట్టపరమైన సమస్యలు పరిష్కరించేందుకు ఈ విధానాన్ని ఎంచుకున్నామని చెప్పారు. నియోజకవర్గం పరిధిలో ఉన్న వృద్ధులు, వికలాంగులు, మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. దీనితో పాటు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో కూడా ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజలు ఇచ్చే అర్జీలను చట్ట పరిధిలో విచారించి నిర్ణీత గడువులోగా పరిష్కరించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చీరాల డిఎస్పీ ఎండి. మోయిన్, సిసిఎస్ డిఎస్పీ పి. జగదీష్ నాయక్, పిజిఆర్ఎస్ సెల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పిజిఆర్ఎస్ లో 272 అర్జీలు స్వీకరణ

**రెవిన్యూ డివిజన్ స్థాయి లోను మరియు నియోజకవర్గం స్థాయి లో పిజిఆర్ఎస్ నిర్వహిస్తాం: జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్**



**పర్చూరు (బాపట్ల జిల్లా) రేపటి కోసం:** ప్రజల వద్దకు పరిపాలనను తీసుకువెళ్లాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు యొక్క ముఖ్య ఉద్దేశమని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వము ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిస్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్) కార్యక్రమాన్ని సోమవారం ఉదయం పర్చూరు నియోజకవర్గం, పర్చూరు మండల కేంద్రంలోని కొల్లావారి కళ్యాణ్ మండపం నందు స్థానిక ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు డి ఆర్ ఓ.జి.గంగధర్ గౌడ్ తో కలసి నిర్వహించిన పిజిఆర్ఎస్ కు పర్చూరు నియోజవర్గం పరిధిలోని వివిధ మండలాల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారులు చెప్పే సమస్యలను వింటూ వారి నుంచి అర్జీలను స్వీకరించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల వద్దకు పరిపాలనను తీసుకువెళ్లాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు యొక్క ముఖ్య ఉద్దేశమని అందులో భాగంగానే సోమవారం పర్చూరు మండల కేంద్రం ప్రవేటు కళ్యాణ్ మండపం నందు అన్ని శాఖల జిల్లా అధికారులు స్థానిక ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల పరిస్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని తెలిపారు.ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కు జిల్లాలోని దూర ప్రాంతాల మండలాల కు చెందిన అర్జీదారులు సమస్యల అర్జీలను అందజేయుటకు చాలా ఇబ్బందులు పడుతున్నారని గుర్తించి ఒక పై ప్రతి సోమవారం ఒకొక్క రెవిన్యూ డివిజన్ కేంద్రంలోను మరియు నియోజకవర్గాల కేంద్రం నందు మరియు సమస్యలు ఎక్కువగా ఉన్న మండలంలో ప్రజా ఫిర్యాదుల పరిస్కార వేదిక నిర్వహించి అర్జీదారుల సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

పర్చూరు మండల కేంద్రం నందు నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 272 వివిధ రకాల సమస్యల అర్జీలు రావడం జరిగిందని వీటిని అన్నిటిని క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులు పర్యటించి పరిశీలించి ఒక నెల లోగా పరిష్కారం చేయడానికి చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈరోజు నిర్వహించిన పి జి ఆర్ ఎస్ లో వచ్చిన అర్జీదారులకు కు సంబంధించి సంబంధించిన అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు. వేసవి కాలంలో జిల్లాలో ఎక్కడ కూడా త్రాగునీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలను తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజలు ప్రభుత్వ సేవలకు సంబంధించి మీ గ్రామ పరిధిలో ఉన్న సచివాలయంలో చలానా చెల్లించి రెవెన్యూ సమస్యలకు సంబంధించి పరిష్కారం చేసు కోవచ్చునని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ లవన్న అర్జీలను ఆర్డీ ఓ.పి.గ్లోరియా, రీజనల్ మేనేజర్ ఆర్టీసీ, విమల, డియం ఒ హెచ్ ఓ,డాక్టర్ ఎస్.విజయమ్మ సి పిఓ.ఏ.ఎస్.రాజు, పిడిలు, డ్వామా,డిఆర్డీఏ,మెప్మా, ఐసిడిఎస్, గృహ నిర్మాణ సంస్థ, విజయలక్ష్మి, సింగయ్య, పాల్, రాధమాదవి, వెంకటేశ్వర రావు, మార్క్ పేడ్ డి యం.కరుణశ్రీ, డి సి హెచ్ ఎస్.పద్మావతి, డిటిసి. పరందామ రెడ్డి,జి యం.డి ఐ సి.రామకృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారిణి విజయనిర్మల,డి పి ఓ.యల్.ప్రభాకర్ రావ్,డి ఈఓ.శ్రీనివాస్,బి.సి. మరియు గిరిజన సంక్షేమ శాఖల అధికారులు శివనాగేశ్వరరావు, అబ్బులు, యల్‌డి ఓ.విజయలక్ష్మి, గ్రామ వార్డు సచివాలయాల జిల్లా కోఆర్డినేటర్ యశ్వంత్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు జయంతి వేడుకలు




**బాపట్ల టౌన్, రేపటి కోసం:** బాపట్ల డాక్టర్ ఎన్‌టీఆర్ ఆహార విజ్ఞాన సాంకేతిక కళాశాలలో వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు జయంతి వేడుకలు ఘనంగా సోమవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు అర్పించి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ డా. ఎం. సర్దార్ బేగ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు 18వ శతాబ్దం చివరి మరియు 19వ శతాబ్దం ప్రారంభంలో ఆంధ్ర ప్రాంతంలో ఒక ప్రముఖ పాలకుడు మరియు జమీందారు అని, ఆలయ నిర్మాణం, పరిపాలన, అమరావతి ప్రాంత అభివృద్ధికి ఆయన చేసిన సేవలకు ఆయనను ప్రత్యేకంగా స్మరించుకుంటారని తెలి పారు. ఆయన రాజధాని అమరావతి, దీనిని ఆయన ఒక సాంస్కృతిక మరియు మతపరమైన కేంద్రంగా అభివృద్ధి చేశారు. ఆయన సాధించిన అత్యంత ముఖ్యమైన విజయాలలో ఒకటి, అనేక ఆలయాల నిర్మాణం మరియు పునరుద్ధరణ, ముఖ్యంగా శివునికి అంకితం చేయబడిన ప్రసిద్ధ అమరలింగేశ్వర ఆలయం. ఆయన పోషణలో, ఈ ఆలయం గొప్ప ప్రాముఖ్యతను సంతరించు కుని ఒక ప్రధాన పుణ్యక్షేత్రంగా మారిందని తెలిపారు. వెంకటాద్రి నాయుడు, వ్యవసాయం మరియు నీటిపారుదల, కళలు, సాహిత్యం మరియు సంస్కృత అభ్యసనాన్ని ప్రోత్సహించి నందుకు, రాజకీయ పరివర్తన కాలంలో (ప్రాంతీయ రాజ్యాల పతనం మరియు బ్రిటిష్ పాలన పెరుగుదల మధ్య) సాపేక్షంగా స్థిరమైన పాలన కొనసాగించారన్నారు. మత మరియు సామాజిక అభివృద్ధి రెండింటికీ మద్దతు ఇచ్చిన న్యాయమైన మరియు ఉదారమైన పాలకుడిగా ఆయన ఆంధ్ర చరిత్రలో స్మరించబడతారని తెలియచేశారు. ఈ కార్యక్రమాన్ని అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.నివేదిత, విద్యార్థి కార్యకలాపాల ఇన్‌చార్జ్‌గా సమర్థవంతంగా నిర్వహించారు. వెంకటాద్రి నాయుడు గొప్ప వ్యక్తిత్వం, పరిపాలనా నైపుణ్యం, ప్రజల పట్ల ఆయనకు ఉన్న సేవాభావం గురించి వివరించారు. సమాజ అభివృద్ధికి ఆయన చేసిన సేవలు ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎన్.వినోద, డాక్టర్ సి.హెచ్. సోమే శ్వరరావు, డాక్టర్ ఈ. గౌతమి, వై.అరుణ కుమారి తదితర అధ్యాపకులు మరియు టీచింగ్ అసోసియేట్లు డా దిలీప్ సేన్, లావణ్య, దాక్షిణ్య భావన, సునీత, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు, బోధన మరియు బోధనేతర సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొని జయంతి వేడుకలను విజయవంతం చేశారు.

## పర్చూరు నియోజకవర్గం పరిధిలో ప్రారంభించిన పనులు పూర్తి చేయాలి

**ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు**



**పర్చూరు (బాపట్ల జిల్లా) రేపటి కోసం:** పర్చూరు నియోజకవర్గం పరిధిలో ప్రారంభించిన పనులను పూర్తి చేయాలని పర్చూరు నియోజకవర్గం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. సోమవారం ఉదయం పర్చూరు నియోజకవర్గం, పర్చూరు మండల కేంద్రంలోని కొల్లా వారి కళ్యాణ్ మండపం నందు నిర్వహించిన పి జి ఆర్ ఎస్ కార్యక్రమంలో పాల్గొని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తో కలసి అర్జీదారులు నుంచి సమస్యల అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పర్చూరు నియోజకవర్గ పరిధిలో ప్రారంభించిన పనులను వెంటనే పూర్తి చేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ సర్వతో జిల్లా కేంద్రంలో నిర్వహించే పిఆర్ఎస్ కార్యక్రమాన్ని పర్చూరు నియోజకవర్గ పరిధిలోని సమస్యల పరిష్కారం చేయడం సంతోషంగా ఉందన్నారు. కొన్ని అర్జీలు జిల్లా స్థాయి అధికారులు పరిష్కారం చేయలేని వాటికి సంబంధించి నిరంతరం పరిష్కారం కోసం మంచి వాతావరణంలో పర్చూరు నియోజకవర్గంలో నిర్వహించడం జరిగిందన్నారు. నియోజకవర్గం పరిధిలో రైతులకు సంబంధించి ముఖ్యంగా శనిగలు, మొక్కజొన్న కొనుగోలుకు సంబంధించి సమస్యను జిల్లా కలెక్టర్ గారు చొరవ తీసుకుని ముఖ్యమంత్రి గారితో చర్చించి సమస్యలను పరిష్కారం చేయాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గారికి సూచించారు. నియోజకవర్గం పరిధిలో ప్రతి గ్రామంలో రైతుల సమస్యలు చాలా వరకు ఉన్నాయని, రైతులు గ్రామాల నుండి వారి పొలాలకు వెళ్లే రోడ్లు వర్షాకాలంలో అయితే చాలా ఇబ్బంది పడవలసిస్తుందని, ఆ రోడ్లకు సంబంధించి పరిశీలించి పరిష్కారం చేయాలన్నారు. గ్రామాల వారిగా 45 కోట్లతో రోడ్లను ఈ సంవత్సరము లో 50 శాతం పనులు పూర్తి చేయాలని చూచించారు.

రైతులకు సంబంధించి కొన్ని ముఖ్యమైన పనులు నిలిచిపోయాయని కొమ్మూరు, గుంటూరు కాల్వ పనులను శాశ్వతంగా పరిష్కారం చేయుటకు తగిన చర్యలు తీసుకో వాలన్నారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని డ్రైనేజ్‌కి సంబంధించి నియోజక వర్గంలో 20 నుండి 25 వరకు ఉన్నాయని,రైతులు అధికారులు కలసి పరిశీలించాలన్నారు. నియోజకవర్గ పరిధిలోని వాగులు అన్నింటిని సర్వే చేయాలన్నారు కొన్ని వాగులను ఉపాధి హామీ ద్వారా చేపట్టిన రోడ్లు పనులకు బిల్లులు అందజేయాలని తెలిపారు నియోజకవర్గ పరిధిలో కొన్ని పనులు మధ్యలోనే ఆగిపోయాయని వాటిని కూడా వెంటనే పూర్తి చేయాలన్నారు ముఖ్యంగా గ్రామాలలో రోడ్లు డ్రైన్లను ఈ సమ్మర్ లోనే పూర్తి చేయాలన్నారు ఈరోజు మా ప్రాంతంలో ప్రజల సమస్యలను పరి ష్కారం చేయుట కోసం పర్చూరు కేంద్రం నందు పిజిఆర్ఎస్ నిర్వహించిన సందర్భంగా జిల్లా కలెక్టర్ గారికి అధికారికి అధికారులకు అందరికీ నా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను అన్నారు. ఈ కార్యక్రమంలో డి యం ఒ హెచ్ ఓ,డాక్టర్ ఎస్.విజయమ్మ సిపిఓ.ఏ.ఎస్.రాజు, పిడి లు, డ్వామా, డిఆర్డీఏ,మెప్మా, ఐసిడిఎస్, గృహ నిర్మాణ సంస్థ, విజయలక్ష్మి, సింగయ్య, పాల్, రాధమాదవి, వెంకటేశ్వరరావు, మార్క్‌పేడ్ డి యం. కరుణశ్రీ, డి సి హెచ్ ఎస్.పద్మావతి, డి టి సి. పరందామ రెడ్డి,జి యం.డి ఐ సి.రామకృష్ణ,డి ఎస్ ఓ.ఆర్.నజీర్ బాషా, జిల్లా వ్యవసాయ అధికారిణి విజయనిర్మల,డి పి ఓ.యల్.ప్రభాకర్ రావ్,డి ఈఓ.శ్రీనివాస్,బి.సి. మరియు గిరిజన సంక్షేమ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు జీవితాన్ని యువత స్ఫూర్తి పొంది సేవ చేయాలి

**జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్**



**పర్చూరు( బాపట్ల జిల్లా) రేపటి కోసం:** రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు తన జీవిత కాలంలో ప్రజల కోసం అనేక సంక్షేమ, సేవా కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వము ఆదేశాల మేరకు రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు జయంతి సందర్భంగా మండల కేంద్రం పర్చూరు లోని కొల్లా వారి కళ్యాణ మండపంలోనందు పర్చూరు నియోజకవర్గం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుతో కలసి రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు చిత్ర పటా నికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు తన జీవిత కాలంలో ప్రజల కోసం అనేక సంక్షేమ, సేవా కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని తెలిపారు. రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు జయంతిని రాష్ట్ర పండు గగా జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ప్రఖ్యాత దాత, పరిపా లకుడు, ప్రజాహితసేవకుడు అయిన రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు తన కాలంలో ప్రజల సంక్షేమం కోసం అనేక సేవా కార్యక్రమాలు చేపట్టి, నీటి వనరుల అభివృద్ధి, ఆలయ నిర్మాణాలు, విద్యా ప్రోత్సాహం వంటి రంగాలలో విశేష కృషి చేశారని చెప్పారు. ముఖ్యంగా అమరావతి ప్రాంత అభివృద్ధికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. అమరావతి రాజధానికి పార్లమెంట్‌లో కూడా ఆమోదం పొందడం జరిగిందని తెలిపారు. అధికారులు, ప్రజలు ఆయన ఆదర్శాలను అనుసరించి సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. యువత ఆయన జీవితం నుండి స్ఫూర్తి పొంది సమాజానికి సేవ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ ఓ.జి.గంగాధర్ గౌడ్,స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లవన్న, ఆర్డీఓ పి.గ్లోరియా, డియం అండ్ హెచ్ ఓ,డాక్టర్ ఎస్.విజయమ్మ సిపి ఓ.ఏ.ఎస్.రాజు, పిడిలు, డ్వామా, డిఆర్డీఏ, మెప్మా, ఐసిడిఎస్, గృహ నిర్మాణ సంస్థ, విజయలక్ష్మి, సింగయ్య, పాల్, రాధమాదవి,వెంకటేశ్వర రావు, మార్క్ పేడ్ డి యం.కరుణశ్రీ, డి సి హెచ్ ఎస్.పద్మావతి, డి టి సి. పరందామ రెడ్డి,జి యం.డి ఐ సి.రామకృష్ణ,డి ఎస్ ఓ.ఆర్.నజీర్ బాషా, జిల్లా వ్యవసాయ అధికారిణి విజయనిర్మల, గిరిజన సంక్షేమ శాఖల అధి కారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, డివిజన్ స్థాయి, మండల స్థాయి అధికారులు, తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల అమ్మకాలలో దొంగ బిల్లుల పై విచారణ జరపాలి



**రేపల్లె, (బాపట్ల జిల్లా) రేపటి కోసం:** వ్యవసాయ సహకార సంఘాల్లో ఎరువుల అమ్మకాలలో జరిగిన అక్రమాలపై, దొంగ బిల్లులపై పూర్తిస్థాయి విచారణ జరపాలని సోమవారం ఆర్డిఓ గ్రీవెన్స్ లో చావలి గ్రామానికి చెందిన గోపాలం శివ నాగేశ్వరరావు ఫిర్యాదు చేశారు, వేమూరు సహకార సంఘంలో యూరియా అమ్మకాలలో పూర్తి అక్రమాలు జరిగాయని యూరియా కొనుగోలు చేయని వారి పేరున దొంగ బిల్లులతో ఫోర్జరీ సంతకాలు చేసుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు, చావలి గ్రామంలో జరిగిన యూరియా అమ్మకాలలో మా అమ్మగారైన గోపాలం ఆదిలక్ష్మి ఎరువులు తీసుకోనప్పటికీ ఎరువులు అమ్మినట్లు దొంగ రసీదులు రాసుకున్నారు, ఆమెకు సంతకమే రాదని ఎరువులు తీసుకున్న బిల్లుపై ఇంగ్లీషులో సంతకం చేసినట్టు ఫోర్జరీ సంతకాలు చేసి ఎరువులు అక్రమంగా అమ్ముకున్నారని ఫిర్యాదులు పేర్కొన్నారు దానికి సంబంధించిన బిల్లు వివరాలను పొందుపరిచారు, అదేవిధంగా వేమూరు సొసైటీ పరిధిలోని జంపని గోడౌను ఎరువులు స్టాక్ పాయింట్ గా చూపించి ఆ గోడ ఉన్న అనా మత్తుగా ప్రవేటు వారికి అప్పగించారని ఫిర్యాదులు పేర్కొన్నారు, వీటిపై పూర్తి విచారణ జరిపి అక్రమాలకు పాల్పడిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని గోపాలం శివ నాగేశ్వరరావు ఫిర్యాదులు పేర్కొన్నారు.

## కళలను ప్రోత్సహించేందుకు ఆర్థిక సాయం



**చీరాల రూరల్(బాపట్ల జిల్లా) రేపటి కోసం:** పట్టణంలోని ఎన్నార్ స్కూల్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కళాంజలి (సాంస్కృతిక మిత్రమండలి) చీరాల, జనరల్ సెక్రటరీ తిరుమలశెట్టి సాంబశివరావు కి రూ.15,000/- ఆర్థిక సహాయాన్ని సోమవారం అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షులు పోల్దాస రామకృష్ణ మాట్లాడుతూ నాటకాలు వినోదంతో పాటు సామాజిక సమస్యలపై అవగాహన పెంచడానికి, విద్యలో సృజనాత్మకతను పెంపొందించడానికి ఉపయోగపడతాయని నాటక రంగానికి ఆధారణ తగ్గుతుందని, కళలను ప్రోత్సహించడానికి పారితోషికం అందజేశామన్నారు. కార్యక్రమంలో చారగళ్ళ గురు ప్రసాద్, వలివేటి మురళీకృష్ణ, నారాయణమూర్తి, శ్రీనివాసరావు, నరసింహారావు, వీరాంజనేయులు, మోహనరావు, రవి, పూర్ణా, హనుమంతరావు, శీరాం రమేష్, తదితర వాకింగ్ సభ్యులు పాల్గొన్నారు.

## ఇంకొల్లులో డీజిల్, పెట్రోల్ కొరత

**ఇంకొల్లు (బాపట్ల జిల్లా), రేపటి కోసం:** ఇంకొల్లు పట్నంలో సోమవారం పెట్రోల్, డీజిల్ కొరత రావటంతో మూడు బంకులు మూతపడ్డాయి. దీంతో వాహనదారులు పెట్రోల్ డీజిల్ కొరకు భారత్ పెట్రోలియం బంకు వద్ద బారులు తీరారు. పోలీసుల పరివేక్షణలో వాహనదారులందరికీ పెట్రోల్ డీజిల్ అందే విధంగా స్థానిక పోలీస్ యంత్రాంగం చర్యలు చేపట్టడంతో వాహనదారులు ఊపిరి పీల్చు కున్నారు. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ బంకుకు కూడా డీజిల్,పెట్రోల్ వాహనం రావడంతో వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు. ఇంకొల్లు మండలంలో పెట్రోల్, డీజిల్ కొరత లేదని వాహనదారుల ఆందోళన చెందవద్దని, వినియోగదారులు పెట్రోలు లేక డీజిల్ను నిల్వ చేయకూడదని తాసిల్దార్ ఏవిఎస్ శ్రీనివాస్ సూచించారు.

## ఉపాధి ప్రణాళిక అమలు చేయాలని ఆర్డిఓకి వినతి

**చీరాల (బాపట్ల జిల్లా), రేపటికోసం:** జనతావారధి కార్యక్రమంలో భాగంగా బాపట్ల జిల్లా యువతకు నైపుణ్యాభివృద్ధి, స్థానిక ఉద్యోగాలు, చేతివృత్తుల ప్రోత్సాహం, స్వయం ఉపాధి అవకాశాల కల్పన కోసం సమగ్ర కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని కోరుతూ బాపట్ల జిల్లా అధ్యక్షులు కొండమూడి బంగారు బాబు, జనతావారది జిల్లా కన్వీనర్ కొక్కిలిగడ్డ శ్రీనివాస్ రాజు, చీరాల ఆర్డీవో డివిజన్ కన్వీనర్ డాక్టర్ తాడివలస దేవరాజు సూచన మేరకు చీరాల ఆర్డిఓ చంద్రశేఖర్ నాయుడుకి సోమవారం చీరాల రెవిన్యూ డివిజన్ బిజెపి కో కన్వీనర్ దామిశెట్టి శ్రీనివాస్ గుప్తా, బిజెపి సీనియర్ నాయకులు మేడికొండ భరణిరావు, యేల్చూరి మురళి వినతిపత్రం అందజేశారు.

## హెల్మెట్ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత బాధ్యతగా ధరించాలి

**జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్**




**చీరాల (బాపట్ల జిల్లా), రేపటి కోసం:** ద్విచక్రవాహనదారు ప్రతి ఒక్కరూ హెల్మెట్ వ్యక్తిగత బాధ్యతగా ధరించాలని, గత 30 రోజులుగా జిల్లా వ్యాప్తంగా హెల్మెట్ ధారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని, జిల్లాలోని ప్రతి పౌరుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనాలపై ప్రయాణించాలని జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ తెలిపారు. "శిరోరక్ష – ప్రాణరక్ష" కార్యక్రమంలో భాగంగా చీరాల పట్టణంలో జిల్లా ఎస్పీ సోమవారం హెల్మెట్ అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. చీరాల పట్టణంలో జిల్లా ఎస్పీ హాయ్ రెస్టారెంట్ వద్ద, మసీద్ సెంటర్ వద్ద స్వయంగా పాల్గొని హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనాలపై ప్రయాణిస్తున్న వారిని అభినందించారు. అదే సమయంలో హెల్మెట్ ధరించకుండా ప్రయాణిస్తున్న వాహన చోదకులకు హెల్మెట్ ధారణ వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించి తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రయాణించాలన్నారు.

# విశాఖకూ 'పెట్రోల్' సెగ




**విశాఖపట్నం, రేపటికోసం:** ఇంధన కొరత సమస్య ఆయిల్ రిఫైనరీ ఉన్న విశాఖకూ చేరింది. సోమవారం బంకుల వద్ద బారులు తీరిన జనం కనిపించారు. అవసరానికి మించి ఇంధనం కొనుగోలు చేయొద్దు అని అధికారులు చెబుతున్న జనం పట్టించుకోవడం లేదు. ఏపీలో ఇప్పటికే ప్రధానంగా డీజిల్ సమస్య వాహనదారులను వేధిస్తున్న సంగతి తెలిసిందే. హెచ్పిసిఎల్ కంపెనీ స్వయంగా నిర్వహించే సిరిపురం లోని రెండు బంకులు వాహనాలతో నిండిపోయాయి. ఇంధన నిల్వలు పూర్తిగా ఉన్నాయన్న సిరిపురం బంక్ మేనేజర్ విశ్వం మీడియాకు చెప్పారు స్టాక్ ఉన్నా 'నో స్టాక్' బోర్డులు పెడితే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు.

## భారత ఉప రాష్ట్రపతి, రాష్ట్ర గవర్నర్‌కు ఘన స్వాగతం





**విశాఖపట్నం, రేపటికోసం:** ఆంధ్రా యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొనుటకు విశాఖపట్నం విచ్చేసిన భారత ఉపరాష్ట్రపతి సీ.పీ.రాధాకృష్ణన్, రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ కు ఘన స్వాగతం లభించింది. ముందుగా ఐ ఎన్ ఎస్ డేగాకు చేరుకున్న ఉప రాష్ట్రపతికి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, శాసనసభాపతి సీహెచ్.అయ్యన్నపాత్రుడు, జిల్లా ఇంచార్జ్ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, పార్లమెంట్ సభ్యులు ఎం.శ్రీభరత్, రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు, జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, ఏయూ వైస్ ఛాన్సలర్ రాజశేఖర్, శాసనసభ్యులు, నేవీ అధికారులు తదితరులు స్వాగతం పలికారు.

**రాష్ట్ర గవర్నర్ కు ఘన స్వాగతం**

విశాఖపట్నం ఎయిర్ పోర్ట్ కు చేరుకున్న రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ కు అధికారులు ఘన స్వాగతం పలికారు. సోమవారం విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ కు శాసనసభాపతి సీహెచ్.అయ్యన్నపాత్రుడు, జిల్లా ఇంచార్జ్ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, పార్లమెంట్ సభ్యులు ఎం. శ్రీభరత్, జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, నౌకాదళ, నేవీ అధికారులు తదితరులు స్వాగతం పలికారు.

## ఘనంగా శ్రీ రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు జయంతి వేడుకలు



**విశాఖపట్నం, రేపటికోసం:** శ్రీ రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు ప్రజాసేవకు అంకితభావంతో పనిచేసిన మహానుభావులలో ఒకరని, ఆయన జీవితం, సేవలు నేటి తరానికి ఆదర్శప్రాయమని జీవీఎంసీ అదనపు కమిషనర్ పి. నల్లనయ్య పేర్కొన్నారు. సోమవారం ఆయన శ్రీ రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు జయంతి సందర్భంగా మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ (జీవీఎంసీ) ప్రధాన కార్యాలయంలో జీవీఎంసీ ప్రధాన ఇంజనీరు పీవీవి సత్యనారాయణ రాజు, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ సి.వాసుదేవరెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ ఏ ప్రభాకర్ రావు, ఇతర అధికారులు ,ఉద్యోగులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలతో ఘనంగా పుష్పాంజలి , నివాళులులను అర్పించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ అదనపు కమిషనర్ పి. నల్లనయ్య మాట్లాడుతూ,అమరావతిని రాజధానిగా చేసుకొని కృష్ణా, గుంటూరు ప్రాంతం పరిపాలించిన జమీందారని, వాసిరెడ్డి నాయక రాజులలో ప్రసిద్ధి పొందిన ప్రభువని,అమరావతి సంస్థాన పాలకులు, కవి పండిత పోషకులు, మంచి పరిపాలనాదక్షులని. వందకు పైగా దేవాలయాలను నిర్మించారని ఆయన పేర్కొన్నారు. ఆయన జయంతిని రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వేడుకగా జరుపుకోవాలని నిర్ణయించిందన్నారు.శ్రీ రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు గారు ప్రజాసేవకు అంకితభావంతో పనిచేసిన మహానుభావులలో ఒకరని, ఆయన జీవితం, సేవలు నేటి తరానికి ఆదర్శప్రాయమని తెలిపారు. సమాజ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి ఆయన చేసిన సేవలను ఎల్లప్పుడూ స్మరించుకోవాలని సూచించారు. అలాగే ఇటువంటి మహనీయుల జయంతులు జరుపుకోవడం ద్వారా యువతలో స్ఫూర్తి నింపవచ్చని, సమాజానికి సేవ చేయాలనే సంకల్పం పెంపొందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పి. పద్మజ, ఇతర అధికారులు, ఉద్యోగులు ,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహావిష్కరణ



**అనకాపల్లి, రేపటికోసం:** అనకాపల్లి జిల్లా మునగపాక మండలం, నాగులపల్లిలో సర్పంచ్ జామి చిన్నమ్మలు నూకరాజు డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. 2019 ఎన్నికల హామీ మేరకు చేపట్టిన ఈ కార్యక్రమం, గ్రామంలోని అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరిగింది. అతిథులు మాట్లాడుతూ, అంబేద్కర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని యువత ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సర్పంచ్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. అనంతరం మొక్కలు నాటి, అన్నసమారాధన నిర్వహించారు.

## ఇంధన సంక్షోభంపై వరుదు కల్యాణి ధ్వజం

**విశాఖపట్నం, రేపటికోసం:** దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో ఇంధన సంక్షోభం తలెత్తడం ప్రభుత్వ అసమర్థ పాలనకు నిదర్శనమని వైసీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వరుదు కల్యాణి విమర్శించారు. పొరుగు రాష్ట్రాల్లో సరఫరా సవ్యంగా ఉన్నా, ఇక్కడ 70 శాతం పెట్రోల్ బంకులు మూతపడటం పరిపాలనా వైఫల్యమేనని ఆమె ఆరోపించారు. ఎరువుల కోసం రైతులు, గ్యాస్ కోసం లబ్ధిదారులు, ఇప్పుడు వాహనదారులు పెట్రోల్ కోసం క్యూలైన్లలో నిలబడే దుస్థితి కల్పించారని చంద్రబాబు సర్కారును ఆమె నిలదీశారు. రాష్ట్రంలోనే ఈ కొరత ఎందుకుందో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# గూగుల్‌కు దాసోహమైన కూటమి ప్రభుత్వం

### నిబంధనలకు విరుద్ధంగా ఈఐఏ నివేదిక

**విశాఖపట్నం, రేపటికోసం:** రాష్ట్రంలోని టిడిపి, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం గూగుల్‌కు దాసోహం అయిందని, దీనికి అనుగుణంగానే నిబంధనలకు విరుద్ధంగా (ఈఐఏ) పర్యావరణ అనుమతులు మంజూరు చేసిందని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం. జగ్గు నాయుడు విమర్శించారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డాక్టర్ బి. గంగారావు, వి. కృష్ణారావు లతో కలిసి పార్టీజిల్లా కార్యాలయం ఏచూరి భవన్లో సోమవారం ప్రెస్ మీట్ నిర్వహించారు.

ఈ సందర్భంగా జగ్గు నాయుడు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాలను, వ్యవసాయం, పర్యావరణం ,అడవులు, వన్యప్రాణులను ఫణంగా పెట్టి ,601.40 ఎకరాల భూమి, 22 వేల కోట్ల రూపాయల ప్రజాధనం గూగుల్ డేటా సెంటర్ కు ధారాదత్తం చేసి, పర్యావరణ, అటవీ చట్టాలను తుంగలో తొక్కి, అదాని భాగస్వామ్యంతో గూగుల్ డేటా సెంటర్ శంకుస్థాపనకు ముఖ్యమంత్రి చంద్రబాబు సిద్ధపడడం దుర్మార్గమన్నారు.

"ఈ డేటా సెంటర్ వలన ప్రత్యక్షంగా పరోక్షంగా 1,88,220 ఉద్యోగాలు వస్తాయని చంద్రబాబు ప్రభుత్వం ప్రకటించింది. కానీ ఈ ఐ ఏ నివేదికలో నిర్మాణ సమయంలో 240 ,డేటా సెంటర్ ప్రారంభం అయిన తర్వాత 1375 ఉద్యోగాలు మాత్రమే వస్తాయని పొందుపరిచారు. ప్రభుత్వ ప్రకటనలోని అంకెల గారడీని ఈ నివేదిక బహిర్గతం చేస్తోంది.

ఇదే చంద్రబాబు ప్రభుత్వం 2019 సంవత్సరంలో మధురవాడలోని హిల్ 3 పై అదా నీ డేటా సెంటర్కు సుమారు 400 ఎకరాల భూమిని కేటాయించారు. ఇందులో 24990 ఉద్యోగాలు కల్పిస్తామని ప్రకటించారు. నేటికి ఏడు సంవత్సరాలయింది. డేటా సెంటర్ నిర్మాణం కాలేదు.ఒక్క ఉద్యోగం ఇవ్వలేదు. 400 ఎకరాలు భూములు మాత్రం ఆదానీ చేతిలో ఉన్నాయి. ఇప్పుడు గూగుల్ , అదాని భాగస్వామ్యంతో మరో 601.40 ఎకరాల భూమిని కట్టబెడుతున్నారు. " అని ధ్వజమెత్తారు.

"విశాఖ ,రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను అవకాశంగా తీసుకొని ఉద్యోగ కల్పన పేరుతో కూటమి ప్రభుత్వం వేలాది ఎకరాల భూములను, ప్రజల సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతోంది. ఉద్యోగ కల్పన అభివృద్ధి ఎడల వీరికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా ఇంతవరకు ఉద్యోగాలు కల్పించని సంస్థల నుండి, భూములను తిరిగి వెనక్కి తీసుకోవాలి" అని డిమాండ్ చేశారు. డేటా సెంటర్ వలన ప్రజల పైన, పర్యావరణం పై ప్రతికూల ప్రభావాలు తీవ్రంగా ఉంటాయని పర్యావరణ వేత్తలు ,ప్రజలు ఆందోళన చెందుతున్నారు. డేటా సెంటర్కు 1000 మెగావాట్ల విద్యుత్తు వాడతారు .దీంతో ఇంతే మొత్తం వేడి వాతావరణంలోకి విడుదల అవుతుంది. దీనివలన ఉష్ణోగ్రతలు పెరిగి పంటలకు, ప్రజలకు, పర్యావరణానికి హాని జరుగుతుంది. డేటా సెంటర్కు 17 ఎంజీడిల నీరు అవసరం. ప్రభుత్వం దీనికి సరఫరా చేస్తుందని ఒప్పందం చేసింది. ఇప్పటికే విశాఖపట్నం ప్రజలు తాగునీరు సాగునీటి కొరతతో ఇబ్బందులు పడుతున్నారు. డేటా సెంటర్కు ప్రభుత్వం సరిపడా నీరు సరఫరా చేయకపోతే భారీ యంత్రాలతో పెద్ద పెద్ద బోర్లు వేస్తారు. దీనివల్ల చుట్టుపక్కల గ్రామాలు, ప్రాంతాల




ప్రజల బోర్లు, బావులు, చెరువులు, భూగర్భ జలాలు అడుగంటి పోతాయి. ప్రజలు నీటి సమస్య ఎదుర్కొనే ప్రమాదం ఉంది. ప్రజల, పర్యావరణ పరిరక్షణ వేత్తల యొక్క ఈ ఆందోళన ను ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాలని జగ్గు నాయుడు డిమాండ్ చేశారు

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డాక్టర్ బి గంగారావు మాట్లాడుతూ డేటా సెంటర్కు వినియోగించే విద్యుత్తును ఏపీ డిస్కముల నుండి కాకుండా, ఏపీ ట్రాన్స్కో నుండి తీసుకుంటున్నట్లు నివేదికలో పేర్కొన్నారు.

గూగుల్ వలన తమ వ్యవసాయాన్ని ,ఉపాధిని కోల్పోతున్న 520 మంది తర్లువాడ రైతులకు నష్టపరిహారం, మూడు సెంట్లు చొప్పున ప్రతి కుటుంబానికి భూమి శంకుస్థాపన తరువాత వారం రోజుల్లో ఇస్తామన్న స్థానిక శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు విశాఖ జిల్లా కలెక్టర్ ఈనెల 25న రైతులకు ఇచ్చిన స్పష్టమైన హామీని అమలు చేయాలని, లేని పక్షంలో రైతుల పక్షాన సిపిఎం పార్టీ నిలిచి పోరాడుతుందని హెచ్చరించారు.

# తెలుగుదండు నిరసన దీక్ష

### ముఖ్యమంత్రిగారికి బహిరంగ లేఖ




**విశాఖపట్నం, రేపటికోసం:** తెలుగుభాష రక్షణలో కూటమి ప్రభుత్వం మాటతప్పిందని, అరచేతిలో అమరావతి చూపిస్తోందని..తెలుగుదండు ఆధ్వర్యంలో మద్దిలపాలెం కూడలి తెలుగుతల్లి విగ్రహం వద్ద కవులు, కళాకారులు,మాతృభాషాభిమానులు నినాదాలు చేస్తూ నిరసన దీక్ష నిర్వహించి, తెలుగుతల్లి విగ్రహం వద్ద "ముఖ్యమంత్రికి బహిరంగలేఖ విడుదల చేశారు. కార్యక్రమంలో తెలుగుదండు అధ్యక్షుడు పరవస్తు సూరి మాట్లాడుతూ.."ఎలుగుతోలు దెచ్చి యేడాది ఉతికినా, నలుపు నలుపేగాని తెలుపురాదు" అన్నట్లు.. గత పాతికేళ్ళుగా మన రాష్ట్రాన్ని మాతృభాషా ద్రోహులే రాజ్యమేలుతున్నారని, ఈ దేశవాళీ పాలకుల కబంధ హస్తాల్లో తెలుగుజాతి నిత్యం మోసపోతూనే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగుతల్లి పాదాల వద్ద విడుదల చేసిన బహిరంగ లేఖలోని అంశాలను వివరిస్తూ..మాతృభాషాభివృద్ధి ప్రాధికార సంస్థను యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేయాలని, తెలుగు మాధ్యమం వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు నుంచి వెంటనే వెనక్కి తీసుకోవాలని, వచ్చే విద్యా సంవత్సరం నుంచే మన తెలుగు గడ్డపై అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో ప్రాథమిక విద్యాబోధన తెలుగులోనే జరిగేటట్లు చర్యలు తీసుకోవాలని, విద్యాహక్కు చట్టాన్ని కట్టుదిట్టంగా అమలుచేయాలని కూటమి ప్రభుత్వానికి వినతి చేశారు. నిరసన దీక్షలో పాల్గొన్న భాషోద్యమకారులు మాట్లాడుతూ.. ఆంధ్ర విశ్వకళా పరిషత్ వారు శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారని, విద్యార్థినీ విద్యార్థులచేత నడివీధుల్లో దిక్కుమాలిన నృత్యాలు చేయిస్తున్నారని, కానీ నగరం నడిబొడ్డున, విశ్వవిద్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న తెలుగుతల్లి విగ్రహానికి కనీసం ఒక దండవేయాలన్న తలంపు వారికి రాలేదని విమర్శించారు. నిరసన దీక్షలో పాల్గొన్న కవులు, కళాకారులు, భాషాభిమానులు నినదిస్తూ..మాతృభాష రక్షణ కోసం ప్రజా ఉద్యమానికి తెలుగుదండు సంకల్పం చెప్పుకొందని, లక్ష సభ్యత్వాలతతో, కోటి గొంతులతో తెలుగుతల్లి పొలికేక పెడుతుందని, మాతృభాషాద్రోహులకు బుద్ధి చెప్పి తెలుగుభాషను భావితరాలకు భద్రంగా అందజేస్తుందని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో.. ప్రజాగాయకులు మజ్జి దేవిశ్రీ, డప్పు శ్రీనివాస్, డాక్టర్ కెవిఎస్ మూర్తి, డాక్టర్ విజయగోపాల్, భాగవతుల సత్యనారాయణ, చేబియ్యం రవిమోహన్, నరహరిశెట్టి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## కుమారుడి బైక్ తగలబెట్టిన తండ్రి



**విశాఖపట్నం , రేపటికోసం:** కుమారుడి కోరిక మేరకు ఆ తండ్రి బైక్ కొనిచ్చారు. దాన్ని ఆ కుమారుడు రోడ్డు నిబంధనలకు విరుద్ధంగా నడిపిస్తుండడంతో ట్రాఫిక్ చలానాలు వస్తున్నాయి. దీంతో విసిగిపోయిన తండ్రి.. చివరకు వాహనాన్ని తగలబెట్టారు. విశాఖలోని పెందుర్తి జరిగిన ఈ ఘటనపై పోలీసుల కథనం.. వేపగుంట సమీప బంటాకాలనీకి చెందిన ఓ వ్యక్తి ఆటో డ్రైవర్గా జీవనం సాగిస్తున్నారు. ఆయనకు ఇద్దరు కుమారులు. వారిలో ఓ కుమారుడు కళాశాలకు వెళ్లొచ్చేందుకు బైక్ కావాలని పట్టుబట్టాడు. తప్పనిసరి పరిస్థితిలో తండ్రి ఏడాది కిందట వాహనం కొనుగోలు చేశారు. అది చేతికందిన తర్వాత ఆ అబ్బాయి తన స్నేహితులతో ఎక్కువగా తిరగడంతో పాటు ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా ఇష్టారీతిన నడిపాడు. గతేడాది ఓ ప్రమాదం జరగ్గా.. ఆసుపత్రి ఖర్చుల కోసం తండ్రి రూ. లక్ష వరకు ఖర్చు చేశారు. తాజాగా మరోమారు ట్రిపుల్ రైడింగ్ కారణంగా జరిమానా పడడంతో తండ్రి అసహనం చెందారు. బైకు కొనివ్వడం వల్లే తన కుమారుడు ఇలా తయారయ్యాడని ఆగ్రహించి కాలనీకి దూరంగా వాహనాన్ని తీసుకెళ్లి తగలబెట్టారు.

## బెంగళూరులో స్టాండప్ కమెడియన్ షోలో జరిగిన పరిణామాన్ని ఖండిస్తున్నాం: పల్లా



**విశాఖపట్నం, రేపటికోసం:** బెంగళూరులో స్టాండప్ కమెడియన్ శరత్ ఉదయ్ షో సందర్భంగా చోటుచేసుకున్న సంఘటనను తెలుగుదేశం పార్టీ తీవ్రంగా పరిగణిస్తోందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆత్మక ప్రకటనలో పేర్కొన్నారు. "ఏదైనా అంశంపై అభ్యంతరాలు ఉంటే, ప్రజాస్వామ్యబద్ధంగా చట్టపరమైన మార్గాల్లో పోరాడాలి. నిబంధనల ప్రకారం ఫిర్యాదులు చేయాలి తప్ప, ఎవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదు. ఆవేశంతో వ్యవహరించడం వల్ల అసలు సమస్య పక్కదారి పట్టి, సమాజానికి తప్పుడు సందేశం వెళ్లే ప్రమాదం ఉంది. ప్రతి కార్యకర్త క్రమశిక్షణతో, సహనంతో వ్యవహరించాలని విజ్ఞప్తి చేస్తున్నా. తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణకు మారుపేరు. భావోద్వేగాలకు లోనై పార్టీ సిద్ధాంతాలకు విరుద్ధంగా ప్రవర్తించవద్దు. ఇటువంటి వివాదాస్పద వ్యక్తుల ఉచ్చులో పడి పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించవద్దని రాష్ట్ర అధ్యక్షుడిగా పార్టీ క్యాడర్‌ను హెచ్చరిస్తున్నాను. ఏదైనా అభ్యంతరకరంగా ఉంటే చట్టపరమైన చర్యల ద్వారానే వారికి బుద్ధి చెప్పాలి." అని పేర్కొన్నారు.

"రాత్రికి రాత్రే ఫేమస్ అవ్వాలనే పిచ్చితో, భావ ప్రకటన స్వేచ్ఛ పేరుతో సమాజ శ్రేయస్సును దెబ్బతీసేలా కొందరు జోకులు వేయడం అక్షంతవ్యం. కేవలం వ్యూస్ కోసం, వ్యక్తిగత ప్రచారం కోసం రాజకీయ నేతలను లేదా వ్యవస్థలను కించపరుస్తూ ఉద్రిక్తతలు సృష్టించడం కొందరు స్టాండప్ కమెడియన్ల పేరుతో బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారు. కామెడీ అనేది వినోదం పంచాలి కానీ, విద్వేషం కాదు. లేనిపక్షంలో రాజ్యాంగం కల్పించిన చట్టపరమైన చర్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. పద్ధతి తప్పేవారు ఎవరైనా సరే, చట్టం తన పని తాను చేసుకుపోతుంది.' అని హెచ్చరించారు.

# మేడే వారోత్సవాలను జయప్రదం చేయండి




**విశాఖపట్నం, రేపటికోసం:** ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే ను విశాఖ జిల్లాలో ఘనంగా నిర్వహించాలని కోరుతూ ఈరోజు జగదాంబ సిఐటియు ఆఫీసులో పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కే ఎస్ వి కుమార్ మాట్లాడుతూ విశాఖ జిల్లాలో మే డే వారోత్సవాల జరపాలని నిర్ణయించామన్నారు. ఈ మే డే సందర్భంగా కార్మికుల పని ప్రదేశాలలో, ఫ్యాక్టరీలలో కార్మికులకు ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నమన్నారు. మే ఒకటో తేదీ నాడు అన్ని ప్రాంతాల్లోనూ పతాకావిష్కరణ జరిపి ప్రదర్శనలు నిర్వహించి సభలు జరపాలన్నారు. అలాగే మే ఒకటో తేదీ నుంచి ఏడో తేదీ వరకు వారం రోజులు పాటు మేడే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని భావించామన్నారు. ప్రతిరోజు సాయంత్రం సమయంలో కార్మికులు నివాస ప్రాంతాల్లో మేడే సాంస్కృతిక సంబరాలు జరుగుతాయని వీటిల్లో కార్మికుల కుటుంబాలు పాల్గొవాలని కోరారు. దేశంలో నరేంద్ర మోడీ రాష్ట్రంలో చంద్రబాబు కూటమి ప్రభుత్వం కార్మికుల మీద పెనుబారాలు వేస్తూ కార్మికులకు నష్టం కలిగించేటటువంటి లేబర్ కోడ్స్ ను తీసుకు వచ్చిందన్నారు. కార్మికులను బానిసలుగా చేసేటటువంటి ఈ లేబర్ కోడ్స్ ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మే డే పోరాటంతో సాధించుకున్నటువంటి ఎనిమిది గంటల పని దినాన్ని 12 గంటలకు పెంచడానికి ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. 8 గంటల పని దినం కోసం మే డే స్ఫూర్తితో మరిన్ని పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆశ అంగనవాడి మధ్యాహ్నం భోజనం పథకం వివోఏ ఆర్పి తదితర స్కీమ్ వర్కర్లు ఆందోళన చేసిన ఫలితంగా త్వరలో మన ప్రభుత్వం వస్తుంది మీ జీతాలు పెంచుతాం. మిమ్మల్ని రెగ్యులర్ చేస్తాము. అని చెప్పిన కూటమి నాయకులు రెండేళ్లు గడిచిన ఇంతవరకు కనీస వేతనాలు పెంచలేదన్నారు. ఇచ్చే జీతాలు కూడా సకాలంలో చెల్లించకుండా నెలలు తరబడి పెండింగ్లో ఉన్నాయన్నారు. గత 15 సంవత్సరాల నుంచి కనీస వేతనాలను సవరించలేదని తక్షణమే కనీస వేతనం 26,000 తక్కువ లేకుండా ఉత్తర్వులు జారీ చేసి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్లకు వేల కోట్ల రూపాయల దోచిపెడుతున్న ప్రభుత్వాలు కార్మికులకు జీతభత్యాలు పెంచమంటే పెంచకపోవడం దుర్మార్గమన్నారు. కనుక మే డే స్ఫూర్తితో భవిష్యత్తులో కనీస వేతనాల కోసం ఉద్యోగ భద్రత కోసం, ఎనిమిది గంటల పని విధానం కోసం జరుగుతున్నటువంటి పోరాటంలో కార్మికుల పెద్ద ఎత్తున పాల్గొనవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఉపాధ్యక్షులు కే యం కుమార్ మంగళం, మద్దిలపాలెం జోన్ కార్యదర్శి పి వెంకట్రావు, జగదాంబజోన్ అధ్యక్షులు టీ నూకరాజు, కేవీపీ చంద్రమౌళి పాల్గొన్నారు.

# కిటకిటలాడుతున్న పెట్రోల్ బంకులు

**విశాఖపట్నం, రేపటికోసం:**విశాఖపట్నం నగరం మరియు శివారు ప్రాంతాల్లో పెట్రోల్, డీజిల్ కొరత తీవ్రంగా నెలకొంది. సరఫరాలో అంతరాయాల కారణంగా, మధురవాడ, గాజువాక, కొమ్మాది వంటి ప్రాంతాల్లోని పెట్రోల్ బంకుల్లో నిల్వలు అడుగంటి 'నో స్టాక్' బోర్డులు దర్శనమిస్తున్నాయి. ఇంధన లభ్యతపై ఆందోళనతో వాహనదారులు అవసరానికి మించి కొనుగోలు చేయడానికి ప్రయత్నిస్తుండటంతో బంకుల వద్ద రద్దీ నెలకొంది. నగరంలో పరిస్థితి కొంత మెరుగ్గా ఉన్నా, శివారు ప్రాంతాల్లో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**నరసన్నపేటలో....**

నరసన్నపేట మండలంలోని పెట్రోల్ బంకుల వద్ద వాహనాల తాకిడి అధికమైంది. పెట్రోల్, డీజిల్ కొరత ఏర్పడుతుందనే వార్తల నేపథ్యంలో, వాహనదారులు ముందు జాగ్రత్తగా తమ వాహనాల్లో ఇంధనం నింపుకోవడానికి పోటీ పడుతున్నారు. అయితే, ప్రస్తుతం పెట్రోల్ కొరత లేదని బంకు నిర్వాహకులు చెబుతున్నప్పటికీ, భవిష్యత్తులో కొరత ఏర్పడే అవకాశాలున్నాయని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



**రాజాంలో...**

రాజాంలో పెట్రోల్, డీజిల్ కొరత తీవ్రమైంది. వాహనదారులు బంకుల వద్ద గంటల తరబడి క్యూలలో నిలబడి ఇబ్బందులు పడుతున్నారు. స్టాక్ ఉన్న చోట్ల క్యాన్లు పెట్టి ఎదురుచూస్తున్నారు. డీజిల్ లభించక ఆటోలు, భారీ వాహనాలు నిలిచిపోవడంతో రవాణా వ్యవస్థ స్తంభించింది. ఈ పరిస్థితిపై వాహనదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



**విజయనగరంలో...**

విజయనగరం జిల్లాలో డీజిల్ కొరతతో ఆటో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డీజిల్ లేకపోతే రోజువారీ కిరాయితో కుటుంబాన్ని పోషించుకోవడం కష్టమవుతుందని, ఇంకెన్ని రోజులు ఈ పరిస్థితి కొనసాగుతుందో తెలియక ఆటో డ్రైవర్లు ఆందోళన చెందుతున్నారు. పెట్రోల్ బంకుల వద్ద ఆటోలు క్యూ కడుతున్నాయి. ఈ సమస్యపై ప్రభుత్వం స్పందించి, డీజిల్ సరఫరాను మెరుగుపరచాలని కార్మికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఏయూ విద్యా సుగంధాన్ని పంచే మహా వృక్షం

**ఏయూ శతాబ్ది వేడుకలో త్రివిక్రమ్ శ్రీనివాస్**



**విశాఖపట్నం, రేపటి కోసం:** ప్రముఖ సినీ దర్శకుడు, రచయిత త్రివిక్రమ్ శ్రీనివాస్ ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థి. ఏయూ శతాబ్ది ఉత్సవాల్లో 3 ఆయన పాల్గొన్నారు. విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ విద్యాలయం తనను ఎలా తీర్చిదిద్దిందో వివరించారు. విద్యా సుగంధాన్ని పంచే ఇంతటి మహా వృక్షాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలో వివరించారు. ఆయన మాటల్లోనే.. "యూనివర్శిటీ డైవర్సిటీకి ప్రతిరూపం. విశ్వంలోని విభిన్న ఆలోచనలు విశ్వవిద్యాలయంలో పరిచయమవుతాయి. మన ఆలోచనా పరిధిని పెంచుతాయి. మనకు ఎంతో విజ్ఞానం ఇక్కడ అందుబాటులో ఉంటుంది. బోధించడం కంటే మనం నేర్చుకోవడమే ఎంతో ముఖ్యం. మనకు తెలిసింది చాలా తక్కువ. ఇక్కడికి వచ్చాక మన ఆలోచనా పరిధి పెరుగుతుంది. ఈ చదువుల తల్లి ఎన్నో విషయాలు నేర్పిస్తుంది. మన బతుకుకు ఒక దారి చూపిస్తుంది. నేను ఫిజిక్స్ విద్యార్థిగా ఇక్కడికి వచ్చాను. కానీ నేను సైన్సు కంటే కవిత్వం, తెలుగు సాహిత్యం మీద ఇక్కడ అవగాహన పెంచుకున్నాను. అదే నన్ను సృజనాత్మక రంగం వైపు నడిపించింది. విశ్వవిద్యాలయం ఆయుధాలు తయారు చేసే కర్మాగారం. మనకు తగిన ఆయుధాన్ని ఎంచుకొని జీవన పోరాటంలోకి అడుగు పెట్టడంలోనే మన విజయం ఆధారపడి ఉంటుంది." అని అన్నారు.




ఆంధ్ర విశ్వవిద్యాలయం నూరేళ్ల పండుగ సందర్భంగా సావనీర్ ఆవిష్కరిస్తున్న అతిథులు

## కమ్మజన సేవా సమితి నూతన భవనంలో గది నిర్మాణానికి విరాళం



**అమరావతి, రేపటి కోసం:** జె.కె.సి. కాలేజీ రోడ్డులో నూతనముగా నిర్మిస్తున్న కమ్మజన సేవాసమితి నూతన భవన సముదాయానికి లండన్‌లో స్థిరపడ్డ డాక్టర్ ఘట్టమనేని హనుమంతరావు, నాగరాజకుమారి 7 లక్షల రూపాయలు నూతన భవనములో వారి అత్తమామలు కీ॥శే॥ అత్తలూరి రంగారావు, పుణ్యవతి జ్ఞాపకారం ఒక రూము నిర్మాణానికి విరాళము కమ్మజన సేవా సమితి కోశాధికారి కావూరి రవిచంద్ర, పాలకవర్గ సభ్యులు మద్రిపూడి సీతారామయ్యకు చెక్కును అందజేశారు. సమితి అధ్యక్షులు మల్లెల హరేంద్రనాధ్ చౌదరి ప్రేరణతో ఈ విరాళము అందజేస్తున్నట్లు హనుమంతరావు తెలిపారు. డాక్టర్ ఘట్టమనేని హనుమంతరావు లోగడ కూడా రూ.3,16,000/లు ఉపకారవేతనాలు డిపాజిట్ క్రింద అందజేశారు. వారు మాట్లాడుతూ ఆడపిల్లల విద్యకు వసతిగృహం పాలకవర్గం వారు ఇస్తున్న ప్రాముఖ్యత, ప్రాధాన్యత, రక్షణ, పారదర్శకత, నియమ నిబంధనలు మరియు ఈ సంస్థ ద్వారా ఎందరో పేద విద్యార్థినులు అవకాశాలు అందుకొని దేశ విదేశాల్లో స్థిరపడటం గొప్ప విషయమని ఈ నూతన భవన సముదాయానికి విరాళము అందజేయటం వల్ల ఆడపిల్లల విద్యార్థినుల అభివృద్ధికి ఎంతో ఉపయోగముగా ఉంటుందని భావిస్తున్నాను తెలిపారు. గత 23 సం॥లుగా ఈ సంస్థతో నాకు అనుబంధం ఉన్నదని, పాలకవర్గం వారు ఒకే మాటపై సంస్థను అభివృద్ధి చేస్తున్నారని, ఇకముందు అలాగే నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భముగా అధ్యక్షులు వారు ఫోన్‌లో మాట్లాడుతూ దాతల సహకారము మరవలేమని, భవన నిర్మాణము అనుకున్నది అనుకుట్లే జరుగుతున్నదని, దాతలు మాపై ఉంచిన నమ్మకానికి నూటికి నూరుశాతం నిర్మాణం పూర్తి చేస్తామని పేర్కొన్నారు. మీలాంటి దాతలు ఎందరో సహృదయముతో ముందుకు వచ్చి విరాళాలు అందజేస్తున్నందునే నూతన వసతిగృహాన్ని 2వేల మంది విద్యార్థినులకు వసతి కల్పించి ఇప్పుడు ఉన్న ఒత్తిడిని తగ్గించుకోవాలని కృషి చేస్తున్నాము. డాక్టర్ ఘట్టమనేని హనుమంతరావుని కోశాధికారి కావూరి రవిచంద్ర మరియ పాలకవర్గ సభ్యులు మద్రిపూడి సీతారామయ్య ఘనముగా సన్మానించడం జరిగిందని అధ్యక్షులు మల్లెల హరేంద్రనాధ్ చౌదరి తెలిపారు.




ఆంధ్ర యూనివర్సిటీ వందేళ్ల వేడుక లో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, గవర్నర్లు, మంత్రి నారా లోకేష్, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, సచిన్ టెండుల్కర్ తదితరులు.

## విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

**మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు**




**విశాఖపట్నం, రేపటి కోసం:** విద్యార్థులు కేవలం డిగ్రీలు సాధించడం మాత్రమే కాకుండా మారుతున్న కాలానికి అనుగుణంగా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు సూచించారు. ఆంధ్ర యూనివర్సిటీ విశిష్టతను ప్రస్తావిస్తూ, ఈ విశ్వవిద్యాలయం మహనీయుల మార్గదర్శకత్వంలో అభివృద్ధి చెందిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువుల పట్ల గౌరవం అత్యంత ముఖ్యమని, వారి మార్గదర్శకత్వమే తన ఎదుగుదలకు కారణమని పేర్కొన్నారు. అలాగే సి.ఆర్. రెడ్డి, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, వి.ఎస్. కృష్ణ వంటి ప్రముఖులు విశ్వవిద్యాలయ అభివృద్ధికి చేసిన సేవలను గుర్తుచేశారు. దాతల సహకారం వల్లే ఈ విద్యాసంస్థ ఎదిగిందని తెలిపారు. విద్యార్థులు పరిశోధనాపరమైన దృక్పథంతో ముందుకు సాగాలని, ప్రపంచ సమస్యలకు పరిష్కారాలను అందించేలా పరిశోధనలు చేయాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. క్రమశిక్షణతో కూడిన జీవనశైలిని అలవర్చుకోవాలని, తెల్లవారుజామున లేవడం, వ్యసనాలకు దూరంగా ఉండడం వంటి మంచి అలవాట్లు పెంపొందించుకోవాలని సూచించారు. ముఖ్యంగా డ్రగ్స్ వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. మాతృభాష పట్ల గౌరవం కలిగి ఉండాలని, తెలుగు మన కంటి చూపులాంటిదని, ఇంగ్లీష్ కళ్లద్దాల వంటిదని పేర్కొన్నారు. అన్ని భాషలు నేర్చుకోవడం మంచిదే అయినా మాతృభాషను మరువకూడదన్నారు. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు పాటించాలని, సంప్రదాయ పౌష్టికాహారాన్ని తీసుకోవాలని, ఫాస్ట్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. కష్టపడి పని చేయడం, క్రమశిక్షణ, అంకితభావం ఉంటే ఎవరైనా ఉన్నత స్థాయికి చేరవచ్చని, తాను ఒక సాధారణ రైతు కుటుంబం నుండి వచ్చి ఈ స్థాయికి చేరుకున్నానని తెలిపారు.

# క్రెడిట్ చోరీలో జగన్‌ది 5జీ స్పీడ్

**ఐదేళ్ల విధ్వంసానికి 'క్రెడిట్' జగన్‌ది అయితే.. అభివృద్ధి 'క్రెడిట్' చంద్రబాబుది**

**హత్యా రాజకీయాలు, దౌర్జన్యాలకు కేరాఫ్ అడ్రస్ వైసీపీ పాలన**

**సర్వే రాళ్ల మీద కూడా తన బొమ్మలే వేయించుకున్న ప్రచార పిచ్చి జగన్ ది**

**- కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్**



**మంగళగిరి, రేపటి కోసం:** రాష్ట్రంలో "క్రెడిట్ చోరీ" అనే కొత్త రాజకీయ సంస్కృతిని ప్రవేశపెట్టిన వ్యక్తి మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని కార్మిక, కర్మాగారాలు, బాయిలర్లు, బీమా వైద్య సేవల శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తీవ్రంగా విమర్శించారు. ప్రజలకు ముందుగానే ఒక అంశం పై సందేహాలు సృష్టించి, తరువాత అదే విషయాన్ని తమ విజయంగా ప్రకటించడం ఆయనకు అలవాటైందని అన్నారు. గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన జగన్ మోహన్ రెడ్డికి, అభివృద్ధి గురించి మాట్లాడే నైతిక హక్కు లేదు. ఎదుటివారి కష్టాన్ని తన ఖాతాలో వేసుకోవడమే కాకుండా, రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిన క్రెడిట్ అంతా ఆయనకే దక్కుతుందని ఎద్దేవా చేశారు. జగన్ రెడ్డికి 'క్రెడిట్ చోరీ' చేయడంలో ఎవరూ సాటిరారు. ఏ పథకమైనా, ప్రాజెక్టైనా అది ఎందుకు అవుతుందో మొదట ప్రజలను తప్పుదోవ పట్టించి, తీరా అది పూర్తయ్యాక మాత్రం "నా వల్లనే అయింది" అని చెప్పుకోవడంలో ఆయన సిద్ధహస్తుడు. ఈ ఐదేళ్ల విధ్వంసానికి పూర్తి బాధ్యత ఆయనదేని విమర్శించారు. నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్ల పాటు 'మూడు ముక్కలాట' ఆడి, అమరావతిని భ్రష్టు పట్టించిన ఘనత జగన్ దే. దేశ చరిత్రలోనే రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ను నిలబెట్టిన క్రెడిట్ ఆయనది కాదా? ఈరోజు మళ్లీ అమరావతి పేరు వినపడటం ఇష్టం లేక కొత్త రాగాలు అందుకుంటున్నారు. ఐదేళ్ల పాటు అమరావతిని గ్రాఫిక్స్ అని, భ్రమ అని అవహేళన చేసిన జగన్ రెడ్డి.. ఇప్పుడు అదే ప్రాంతాన్ని 'మావిగన్' అని పిలుస్తూ క్రెడిట్ చోరీకి పాల్పడుతున్నారు. అమరావతి పేరు పలకడం ఇష్టం లేకనే ఇలా కొత్త పేర్లతో ప్రజలను మభ్యపెడుతున్నారు. రాష్ట్ర ఆర్థిక మూలాలను దెబ్బతీసి, ఏపీని అప్పుల పాలు చేసిన క్రెడిట్ జగన్ రెడ్డిదే. ఆయన పాలనలో సాఫ్ట్‌వేర్ కంపెనీల నుంచి అండర్‌వేర్ కంపెనీల వరకు అన్నీ పారిపోయాయి. కియా ఎక్స్‌పాన్షన్, అమర్ రాజా బ్యాటరీస్ వంటి సుమారు 40 భారీ పరిశ్రమలు రాష్ట్రం వదిలి వెళ్లాల్సిన పరిస్థితి కల్పించారు. ఐదేళ్ల కాలంలో కల్తీ మద్యం ఏరులై పారించి, సుమారు 30 వేల మంది ప్రజల ఆరోగ్యాన్ని చిన్నాభిన్నం చేసిన పాపం ఆయనదే. రాష్ట్రవ్యాప్తంగా నాసిరకం 'జే-బ్రాండ్' మద్యాన్ని ఏరులై పారించి, ప్రజల ప్రాణాలతో ఆడుకున్న ఘనత జగన్‌దే అన్నారు.

## వారసత్వ ఆస్తిని కబ్జా చేసిన మేయర్ భర్త పై గ్రీవెన్స్ లో ఫిర్యాదు

**అర్జీలు స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేసిన నేతలు కార్మిక, కర్మాగారాలు, బాయిలర్లు, బీమా వైద్య సేవల శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్సీ బీ.టీ.నాయుడు**



**అమరావతి, రేపటి కోసం:** కాకినాడ జిల్లా జిల్లా గైగోలుపాడు గ్రామానికి చెందిన వెంకటరమణ నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో నేతలకు అర్జీ ఇచ్చి అభ్యర్థిస్తూ.. కాకినాడ నగరంలో తమ కుటుంబానికి చెందిన సుమారు 10 కోట్ల రూపాయల విలువైన వారసత్వ ఆస్తిని గత ప్రభుత్వ అండదండలతో కొందరు వ్యక్తులు అక్రమంగా కబ్జా చేశారు. మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి ప్రోత్సాహంతో వైఎస్ఆర్సీపీ మేయర్ భర్త సుంకర విద్యాసాగర్, సుంకర మాధవకృష్ణ, తమ సోదరుడు అనుసూరి సుబ్రమణ్యం కలిసి ఈ అక్రమానికి పాల్పడ్డారు. ఫోర్జరీ సంతకాలతో కూడిన దస్తావేజులు సృష్టించి తప్పుడు సర్వే రిపోర్టులు, తప్పుడు మరణ ధృవీకరణ పత్రాలను సృష్టించి తమ ఆస్తిని కాజేశారు. గత మూడు ఏళ్లుగా ఈ స్థలాన్ని తమ ఆధీనంలో ఉంచుకుని, ప్రస్తుతం అక్కడ "శ్రీనివాసం" పేరుతో అక్రమంగా ఒక అపార్ట్‌మెంట్ నిర్మిస్తున్నారు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన ఎలాంటి న్యాయం జరగలేదు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని నేతలు కార్మిక, కర్మాగారాలు, బాయిలర్లు, బీమా వైద్య సేవల శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్సీ బీ.టీ.నాయుడులకు అర్జీ ఇచ్చి అభ్యర్థించారు.

## ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన ఏర్పాట్లు పకడ్బందీగా జరగాలి

**జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ**



**పామర్రు, రేపటి కోసం:** మే నెల 1వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేయు నిమిత్తం జిల్లాకు వస్తున్న దృష్ట్యా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు పామర్రు శాసన సభ్యులు వర్ల కుమార రాజాలతో కలసి పామర్రు నియోజకవవర్గం పమిడి ముక్కల మండలంలో పర్యటించారు. మండలంలోని కపిలేశ్వరపురం గ్రామ పొలాల్లో హెలిపాడు నిర్మాణం పనులు పరిశీలించారు. రేఖా చిత్రపటాన్ని పరిశీలించి స్థల నిర్ధారణ చేశారు. పక్కన ఏర్పాటు చేసే క్యాడర్ సమావేశ ప్రదేశం నుండి హెలిపాడు వరకు రహదారికి ఇరువైపులా పకడ్బందీగా బారికేడింగ్ ఏర్పాటు చేయాలని, ప్రధాన రహదారి నుండి పొలం లోపలికి వచ్చేందుకు అప్రోచ్ రోడ్డు వేయాలని కలెక్టర్ ఆర్ అండ్ బి అధికారులకు సూచించారు.

## రాష్ట్ర సహాయ కార్యదర్శిగా మిరియాల కృష్ణారావు



**విజయనగరం, రేపటి కోసం:** అఖిల భారత శరీర, అవయవదాతల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా డాక్టర్ మిరియాల కృష్ణారావు బాధ్యతలు తీసుకున్నారు. విజయవాడలో సోమవారం జరిగిన ఓ సమావేశంలో ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ గూడూరు సీతామహాలక్ష్మి ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు కే.భారతి, ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షిణగం శివాజీ పాల్గొన్నారు.

Published by Srikanth Mikkilineni, Published at D.No.15-8-177, 1st Lane, Rajendra Nagar, Guntur - 522006, Owned by Srikanth Mikkilineni, Editor : Sakhamuru Srinivasa Prasad, Printer Petta Venkata Suryanarayana, Printed at Sree Sesha Sai Enterprises, D.No. 3-88, Chandra Theatre, Gosala Village, Krishna Dist. - 521151. Ph : 0863-3500207, 3509930, Founder : Late Sri Boppana Vijay Kumar.